
SRI GEETAANSHA
DIGITALS
JUST 1Lt. 2000/- ONLY
IN AP & TG ONLY
FOR MORE DETAILS PLZ CONTACT: 9394855244

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు


మంగళకాళీ పీఠం
హరయోగ... రాజయోగ... క్రియాయోగ...
దశ మహా విద్యాధి మంత్ర శాస్త్ర సిద్ధులు, సహస్ర రుద్రాక్ష ధారణా దీక్షాధారి,
కాళీ - కాలభైరవ - ప్రత్యంగీరా ఉపాసకులు, హిమాలయ పరంపర - సిద్ధ గురువులు అయిన
పరమపూజ్య తీతీతీ పరమేశ్వరానందగిరి స్వామిజీ వారు
పీఠాధిపతి - మంగళకాళీ పీఠం
(ఈ పీఠము నందు వ్యక్తిగత మరియు సామూహిక హోమములు నిర్వహించబడును)
శిష్యులు : 628 100 7675, 70328 97231

సంపుటి : 1 సంచిక :307 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | బుధవారం 11 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :307 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | WED 11 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


PenPower
పెన్ పవర్ ఎక్స్‌క్లూజివ్ | ఎపిసోడ్ -1
వెళ్లిపోయిన ఎమ్మార్వో
మళ్లీ ఎందుకొచ్చారు?
తహసీల్దార్ సునీల్ కుమార్ పునర్నియామకం ఎవరికోసం?
ఎమ్మెల్యే చొరవతోనే తిరిగి వచ్చారన్న ప్రచారంలో నిజమెంత?
అదే స్థానానికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకోచ్చింది?
ఎంపీటీసీ ఎన్నికల తర్వాత తహసీల్దార్‌పై సంచలన ఆరోపణలు
పరిమి రవికుమార్ ఆరోపణలతో రాజకీయ వర్గాల్లో చర్చ
బదిలీ, పునర్నియామక ఉత్తర్వులను వెల్లడించాలనే ప్రశ్న తెరపైకి
రెవెన్యూ వ్యవస్థలో రాజకీయ జోక్యంపై పలు అనుమానాలు

వివరాలు 2లో..



ఏపీ వైపు మరో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

- ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం
- 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- నవంబర్ 14 మరియు 15 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- తెలంగాణలో క్రమంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

- మిగతా 2లో

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల.. పెరిగిన పోస్టులు

- ఏపీలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల
- గతంలో ప్రకటించిన 686 పోస్టులను 720కి పైగా పెంచిన ఏపీపీఎస్సీ
- డిసెంబర్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 2027 ఫిబ్రవరి 21న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ
- ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకునే అవకాశం

- మిగతా 2లో

APPSC

ఏపీలో భారీ పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

రూ.31 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్!





- ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ (ఆఎ+జ-శ=) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ - ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో

- మిగతా 2లో

జనవరిలో సహకార ఎన్నికలు



అమరావతి: విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా దాదాపు రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు జరగనున్నాయని, తద్వారా 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

- మిగతా 2లో


వ్యక్తిగత విమర్శలు వద్దు!

పవన్ కల్యాణ్ వ్యక్తిగత వ్యవహారంపై టీడీపీ, వైసీపీ ప్రకటన.. పార్టీ కేడర్లకు కీలక ఆదేశాలు!

- పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్నట్లు అధికారిక ప్రకటన
- ఇది తమ వ్యక్తిగత విషయమని, గోప్యతకు గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి
- ఈ అంశంపై స్పందించవద్దని కేడర్‌కు ఐటీడీపీ ఆదేశం
- వ్యక్తిగత విమర్శలు చేయొద్దంటూ వైసీపీ కూడా ప్రకటన
- రాజకీయాల్లో హుందాతనాన్ని ప్రదర్శించిన ప్రధాన పార్టీలు

- మిగతా 2లో

రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

- సంజయ్ సస్పెన్షన్‌ను మరోసారి పొడిగించిన ఏపీ ప్రభుత్వం
- రిటైర్మెంట్ తేదీ 2027 మార్చి 31 వరకు లేదా విచారణ పూర్తయ్యే వరకు వేటు కొనసాగింపు
- మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



- మిగతా 2లో



గాలిని కాదు.. విషాన్ని పీలుస్తున్న జనం!
ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో మోగుతున్న ప్రమాద ఘంటికలు!

దీపావళి తర్వాత మరింత తీవ్రమైన వాయు కాలుష్యం.. అత్యంత కలుషిత ప్రాంతాల్లో లోనీ.. పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల పొగ, నిర్మాణ ధూళితో ప్రజారోగ్యానికి పెనుముప్పు!

దీపావళి పండుగ సంబరాలు ముగిసినప్పటికీ ఉత్తర భారతదేశాన్ని వాయు కాలుష్య భూతం వదలడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడమే కష్టంగా మారింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని ఉత్తరప్రదేశ్‌లోని లోనీ ప్రాంతంలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. దీపావళి అనంతరం ఢిల్లీ--జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో అత్యధిక కాలుష్య ప్రభావానికి గురైన ప్రాంతాల్లో లోనీ ఒకటిగా నిలిచింది. గత 12 నెలల కాలంలో లోనిలో సగటు పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాల సాంద్రత ఒక క్యూబిక్ మీటరు గాలికి 112.5 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన వార్షిక మార్గదర్శక పరిమితి 5 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 22 రెట్లు అధికం. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ ఐక్యూఎయిర్ వార్షిక కాలుష్య ర్యాంకింగ్స్‌లోనూ లోనీ ప్రపంచంలోని అత్యంత కలుషిత ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

కాలుష్య సంక్షోభానికి పది ప్రధాన కారణాలు : లోనిలో వాయు నాణ్యత ఇంతగా దిగజారడానికి దీపావళి వేడుకలే ఏకైక కారణం కాదు. పారిశ్రామిక కార్యకలాపాలు, వాహనాల రాకపోకలు, పర్యావరణ పరిస్థితులు, ప్రతికూల వాతావరణ మార్పులు కలిసి కాలుష్య తీవ్రతను పెంచుతున్నాయి.

1. పారిశ్రామిక ఉద్గారాలు: లోనీ పరిసరాల్లోని పరిశ్రమలు, చిన్న తరహా తయారీ కేంద్రాల నుంచి వెలువడే పొగ, విషపూరిత వాయువులు గాలిని కలుషితం చేస్తున్నాయి. ముఖ్యంగా లోహాలను కరిగించే కొలిమిల నుంచి వెలువడే హానికర ఉద్గారాలు వాయు నాణ్యతను మరింత దిగజారుస్తున్నాయి.

2. రహదారులపై దుమ్ము: అధ్వానంగా ఉన్న రహదారులు, దెబ్బతిన్న రహదారి ఉపరితలాలు, దుమ్ము నియంత్రణ చర్యలు సరిగా లేకపోవడంతో పెద్దఎత్తున ధూళి గాలిలో కలుస్తోంది. చలికాలంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోంది.

3. నిర్మాణ కార్యకలాపాలు: నివాస భవనాలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు నిరంతరం కొనసాగుతుండటంతో తవ్వకాలు, నిర్మాణ సామగ్రి నిర్వహణ ద్వారా భారీగా ధూళి వెలువడుతోంది. ఇది కాలుష్యాన్ని మరింత పెంచుతోంది.

4. భారీ వాహనాల రాకపోకలు: ఢిల్లీ, ఘజియాబాద్, బాఘ్‌పత్ ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంది. ముఖ్యంగా ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే, ఢిల్లీ--డెహ్రాడూన్ జాతీయ రహదారులపై భారీ ట్రక్కుల రాకపోకలతో వెలువడే పొగ కాలుష్యానికి ప్రధాన కారణంగా మారుతోంది.

5. బహిరంగ ప్రదేశాల్లో చెత్త దహనం: జనాభా పెరుగుదలతో పాటు వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. గృహ, పారిశ్రామిక వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో తగలబెట్టడం ద్వారా విషపూరిత పొగ, హానికరమైన సూక్ష్మ ధూళి కణాలు వాతావరణంలోకి చేరుతున్నాయి.

6. ఇటుక బట్టీలు: బాఘ్‌పత్ పరిసరాల్లోని ఇటుక బట్టీల నుంచి వెలువడే పొగ, హానికర ఉద్గారాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఇటుకల తయారీ కోసం మట్టి తవ్వకాలు, ముడిసరుకు రవాణా వల్ల కూడా పెద్దఎత్తున ధూళి వ్యాపిస్తోంది.

7. పంట వ్యర్థాల దహనం: శీతాకాలం ప్రారంభంలో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంట అవశేషాలను తగలబెడుతున్నారు. ఈ మంటల నుంచి వెలువడే పొగ గాలుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపించి ఢిల్లీ--ఎన్‌సీఆర్‌తో పాటు లోనీ ప్రాంతాన్నీ ప్రభావితం చేస్తోంది.

8. ప్రతికూల వాతావరణ పరిస్థితులు: చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, వాతావరణంలో తేమ పెరగడం, గాలి వేగం తగ్గడం వల్ల కాలుష్య కారకాలు సులభంగా చెదరిపోవడం లేదు. ఫలితంగా విషపూరిత కణాలు భూమికి సమీపంలోనే నిలిచిపోయి కాలుష్య తీవ్రతను పెంచుతున్నాయి.

9. రసాయనిక చర్యలు: సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, అమ్మోనియా వంటి వాయువులు వాతావరణంలోని ఇతర కాలుష్య కారకాలతో రసాయనిక చర్యలకు లోనై ద్వితీయ సూక్ష్మ ధూళి కణాలను ఏర్పరుస్తాయి. ఇవి ప్రమాదకరమైన పీఎం2.5 కణాల సాంద్రతను మరింత పెంచుతున్నాయి.

10.ఢిల్లీ-ఎన్‌సీఆర్ కాలుష్య ప్రభావం: ఢిల్లీ, ఘజియాబాద్, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, పారిశ్రామిక ఉద్గారాలు, భారీ నిర్మాణ కార్యకలాపాల ప్రభావం లోనీపై కూడా పడుతోంది. కాలుష్యానికి ప్రాంతీయ సరిహద్దులు ఉండవని, ఒక ప్రాంతంలో వెలువడే కాలుష్యం మరో ప్రాంతాన్నీ ప్రభావితం చేస్తుందని ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

ఢిల్లీలోనూ ప్రమాదకర స్థాయికి చేరిన వాయు నాణ్యత : దేశ రాజధాని ఢిల్లీలోనూ పరిస్థితి ఏమాత్రం మెరుగ్గా లేదు. అధికారిక గణాంకాల ప్రకారం ఉదయం 8.10 గంటల సమయంలో ఢిల్లీ గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ--AQI) 483కు చేరుకుంది. ఇది అత్యంత తీవ్రమైన కాలుష్య స్థాయి. మరోవైపు ఐక్యూఎయిర్ వంటి ప్రైవేటు వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థలు షాదారా, దక్షిణ ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 1,000 దాటినట్లు వెల్లడించాయి. వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న ఈ గణాంకాలు రాజధానిలో కాలుష్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తున్నాయి.

ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పీఎం2.5 కణాలు : గాలిలో పెరుగుతున్న పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. ఈ అతి సూక్ష్మ కణాలు శ్వాసకోశ వ్యవస్థలోకి లోతుగా ప్రవేశించి ఊపిరితిత్తులను చేరడమే కాకుండా రక్తప్రవాహంలోకి కూడా ప్రవేశించే ప్రమాదం ఉంది. దీనివల్ల శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాలుష్య గాలిని దీర్ఘకాలం పీల్చడం వల్ల గుండె జబ్బులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, ఇప్పటికే శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కాలుష్యం తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం తగ్గించడం, బహిరంగ ప్రదేశాల్లో కఠినమైన శారీరక శ్రమకు దూరంగా ఉండటం, ఆరోగ్య శాఖ సూచనలు పాటించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

దీపావళి ఒక్కటే కారణం కాదు.. దీర్ఘకాలిక పర్యావరణ సంక్షోభం! : దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల కొద్ది గంటల్లోనే వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, లోనీతో పాటు ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంతంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితికి పండుగ వేడుకలే ఏకైక కారణం కాదు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల పొగ, నిర్మాణ ధూళి, బహిరంగ చెత్త దహనం, పంట వ్యర్థాల కాల్చివేత, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కలిసి ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. రోజురోజుకూ దిగజారుతున్న గాలి నాణ్యత ప్రస్తుత కాలుష్య నియంత్రణ చర్యల సమర్థతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వాల సంసిద్ధతపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, పరిశ్రమలపై నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ, రహదారులపై దుమ్ము నియంత్రణ, పొరుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో కూడిన కార్యాచరణ తక్షణ అవసరంగా మారింది.తాత్కాలిక ఆంక్షలు, కాలానుగుణ అత్యవసర చర్యలతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. కాలుష్యానికి మూలకారణాలను గుర్తించి వాటిని నిర్మూలించేలా ప్రభుత్వాలు సమగ్ర దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి. స్వచ్ఛమైన గాలి విలాసం కాదు.. ప్రతి మనిషి జీవించే హక్కులో అంతర్భాగం. ఇప్పటికైనా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టకపోతే ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రజలు పర్యావరణ నిర్లక్ష్యానికి రానున్న రోజుల్లోనూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది

వెళ్లిపోయిన ఎమ్మార్వో మళ్లీ ఎందుకొచ్చారు?

- తహసీల్దార్ సునీల్ కుమార్ పునర్నియామకం ఎవరికోసం ?
- ఎమ్మెల్యే చొరవతోనే తిరిగి వచ్చారన్న ప్రచారంలో నిజమెంత?
- అదే స్థానానికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకొచ్చింది ?
- ఎంపీటీసీ ఎన్నికల తర్వాత తహసీల్దార్‌పై సంచలన ఆరోపణలు
- పరిమి రవికుమార్ ఆరోపణలతో రాజకీయ వర్గాల్లో చర్చ
- బదిలీ, పునర్నియామక ఉత్తర్వులను వెల్లడించాలనే ప్రశ్న తెరపైకి
- రెవెన్యూ వ్యవస్థలో రాజకీయ జోక్యంపై పలు అనుమానాలు

స్టేట్ బ్యూరో పెన్ పవర్ తాడేపల్లిగూడెం, నవంబర్ 10:
ప్రజలకు సేవలందించాల్సిన రెవెన్యూ వ్యవస్థలో ఒక అధికారి నియామకం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారింది. తాడేపల్లిగూడెం తహసీల్దార్ సునీల్ కుమార్ గతంలో ఇక్కడి నుంచి బదిలీ అయి, తిరిగి అదే స్థానానికి రావడం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.?. వెళ్లిపోయిన అధికారిని మళ్లీ తీసుకురావాల్సిన అవసరమేమిటి? ఇది పరిపాలనాపరమైన నిర్ణయమా? లేక రాజకీయ సిఫార్సుల ప్రభావమా? అన్న అంశాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.ఇటీవల వెంకటరామన్నగూడెం ఎంపీటీసీ ఎన్నికల అనంతరం

ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఓటమికి సొంత పార్టీ నాయకులతో పాటు తహసీల్దార్ వ్యవహారశైలి కూడా కారణమని టీడీపీ అభ్యర్థి పరిమి రవికుమార్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలపై విచారణ జరిపించాలని, సంబంధిత కాల్ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సిఫార్సుతోనే సునీల్ కుమార్ తిరిగి వచ్చారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.? ప్రజాప్రతినిధులు అధికారుల నియామకాలపై సిఫార్సులు చేయడం తప్పు కానప్పటికీ, అటువంటి నియామకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగాయా అన్నది ముఖ్యం. అసలు సునీల్ కుమార్‌ను గతంలో గూడెం నుంచి ఎందుకు బదిలీ చేశారు? తిరిగి అదే స్థానానికి ఎవరి ప్రతిపాదనతో నియమించారు? పునర్నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు రెవెన్యూ ఉన్నతాధికారులే స్పష్టత ఇవ్వాల్సిన అవసరముంది. భూముల రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ భూముల

పరిరక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వహించే తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు జరగాలి. పలుకుబడి ఉన్నవారితో పాటు సామాన్య ప్రజల వినతులకూ సమాన ప్రాధాన్యం దక్కాలి. ఒక అధికారి ఎవరి సిఫార్సుతో వచ్చారన్నదానికంటే, ఆయన ఎవరి కోసం పనిచేస్తున్నారు? చట్టం ప్రకారమా? రాజకీయ ప్రభావంతోనా? అన్నదే ప్రధాన ప్రశ్న. బదిలీ ఉత్తర్వులు, అధికారిక రికార్డులు, సంబంధిత వ్యక్తుల వివరణలతోనే వాస్తవాలు తేలాలి. తహసీల్దార్ నియామకంపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే. పారదర్శకమైన వివరణతోనే ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టగలరు.

ఎపిసోడ్--2
తహసీల్దార్ కార్యాలయంలో నిజంగా ఒత్తిళ్లు ఉన్నాయా?
కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిళ్ల ప్రచారం..
అధికారుల స్వతంత్ర నిర్ణయాల్లో జోక్యం ఉందా?

ఏపీలో భారీ పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజీ తరువాయి

రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

వ్యక్తిగత విమర్శలు వద్దు!

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. తాము పరస్పర అంగీకారంతో, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. తమ పిల్లల పట్ల బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కొనసాగుతామని, స్నేహితులుగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సున్నితమైన సమయంలో తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని వారు కోరారు.పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఈ పరిణామంపై అధికార కూటమిలో భాగమైన తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఐటీడీపీ (ఐఎఫ్) స్పందించింది. ఎవరి వ్యక్తిగత జీవితంపైనా స్పందించవద్దని పేర్కొంది. కూటమి పార్టీల నేతలతో పాటు వైసీపీ నేతల వ్యక్తిగత జీవితాలపై కూడా ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని స్పష్టం చేసింది. ఐటీడీపీకి అనుబంధంగా ఉన్న ఏ సోషల్ మీడియా ఖాతా నుంచైనా ఇలాంటి వ్యాఖ్యలు వస్తే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇతరులను కించపరిచేలా చేసే వ్యక్తిగత అభిప్రాయాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.అటు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా హుందాగా స్పందించింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందనేది ఆ ప్రకటన సారాంశం. "ఒక రాజకీయ నాయకుడి వ్యక్తిగత విషయానికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జరుగుతున్నట్లు గమనించాము. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. కాబట్టి సంబంధిత వ్యక్తుల గోప్యతను గౌరవించాలి. బహిరంగ వేదికలపై మాట్లాడేటప్పుడు విచక్షణ పాటించాలి. ఈ విషయంలో పార్టీ నేతలు, ప్రతినిధులు, కేడర్, సోషల్ మీడియా కార్యకర్తలు కొన్ని సూచనలు పాటించాలి" అని ఆ ప్రకటనలో పేర్కొంది. సాధారణంగా రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు, ట్రోలింగ్స్ జరిగే ప్రస్తుత రాజకీయాల్లో పవన్ విషయంలో వైసీపీ, టీడీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త, ఆరోగ్యకరమైన సంప్రదాయానికి తెరలేపినట్లుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత దాడులకు దూరంగా ఉంటూ, విధానపరమైన అంశాలపైనే దృష్టి సారించాలనే సందేశాన్ని ఈ పార్టీలు తమ కేడర్‌కు బలంగా పంపినట్లయింది.

ఏపీ వైపు మరో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్పడిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

తుపానుగా మారే అవకాశం తక్కువే

ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఇటీవలే వచ్చిన అర్నబ్, మురసు తుపానుల ప్రభావంతో రాష్ట్రంలో పంటలు, రహదారులు, విద్యుత్ స్తంభాలకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో మరిన్ని తుపానులు లేదా తీవ్ర అల్పపీడనాలు ఏర్పడే పరిస్థితులు లేకపోలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మత్స్యకారులకు హెచ్చరికలు

తాజా అల్పపీడన పరిణామాలతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాతావరణం అలజడిగా మారనుంది. సముద్రంలో అలల ఉద్ధృతి పెరగడంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 14, 15 తేదీల్లో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో పెరుగుతున్న చలి

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. సోమవారం రాత్రి రాష్ట్రంలోని దాదాపు 16 జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14.7 డిగ్రీల నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 14.7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ అల్పపీడనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున, దాని గమనం మరియు తీవ్రతలో మార్పులు జరిగే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా బులెటిన్ల ద్వారా స్పష్టత ఇవ్వనుంది.

ఒకేచోట 86 వాహనాలు ఢీ.. 12 మంది మృతి!

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే యాంబోల్ సమీపంలో ఒకే ప్రదేశంలో అటు, ఇటు ఉన్న రోడ్లపై దాదాపు 86 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో చాలావరకు ట్రక్కులే ఉన్నాయి.

ఘటనా స్థలంలోనే 10 మంది మృతి చెందగా.. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని మంత్రి కాట్యా ఇవ్మోవా వెల్లడించారు. మరో 46 మందిని చికిత్స కోసం తరలించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న ప్రధాని రుమెన్ రాదేవ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. ఇలాంటి భయానక దృశ్యాన్ని తాను ఎన్నడూ చూడలేదని ప్రాంతీయ గవర్నర్ మిహైల్ కాషెరోవ్ చెప్పారు. దట్టమైన పొగమంచు కారణంగా దారి సరిగ్గా కనిపించకపోవడం, రోడ్డు తడిగా ఉండటం వంటివి ప్రమాదానికి దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్
విడుదల.. పెరిగిన పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి.ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.

విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ , చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:

ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ (పెన్ & పేపర్) పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఫీజు-స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (psc.ap.gov.in) లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ అయిన 2027 మార్చి 31 వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ ముగిసే వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం అధికారిక జీవో విడుదల చేసింది.గతంలో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో 'అగ్ని' వెబ్ పోర్టల్ నిర్వహణలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సంజయ్‌పై వచ్చాయి

శ్రీ హరిహర క్షేత్రంలో నిరాటంకంగా స్వాముల భిక్ష కార్యక్రమం ప్రారంభం

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 10 :

చిలకలూరిపేట పట్టణం సుభానీ నగర్‌లోని శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప, శివ, భవానీ స్వాములకు వార్షిక భిక్ష కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ తోట రాజరాజేశ్వరి, తోట రాజారమేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భిక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు, ప్రధాన అర్చకులు అంబటిపూడి వెంకటేశ్వరశాస్త్రి మాట్లాడుతూ.. దాతల సహాయ సహకారాలతో గత 18 ఏళ్లుగా ప్రతి ఏటా 45 రోజుల పాటు (నవంబర్ 10 నుంచి డిసెంబర్ 25 వరకు) ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని, స్వాములందరూ భిక్ష స్వీకరించాలని కోరారు. పాలకమండలి గౌరవాధ్యక్షులు చల్లా విజయ్‌కుమార్, అర్చకులు



లోకాభిరామయ్య దంపతులు, గణేష్ మేస్త్రి, బిఎస్ఎన్ఎల్ శీను, సుబ్రహ్మణ్యం, వాటర్ శీను, ధూళిపాళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ అంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

తపాలా కార్యాలయాల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలు

భోపాల్, పెన్ పవర్:నవంబర్, 10,

తపాలా శాఖ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రెండు ప్రధాన తపాలా కార్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎలాంటిముందస్తుసమాచారంలేకుండాకార్యాలయాలన ు సందర్శించిన కేంద్ర మంత్రి, అక్కడ అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, ఆధునిక సాంకేతిక విధానాల అమలును స్వయంగా పరిశీలించారు.తపాలా కార్యాలయాల్లో కౌంటర్ సేవలు, టికెటింగ్ విధానం, పార్సెల్ డెలివరీ నెట్‌వర్క్, మెయిల్ హ్యాండ్లింగ్ వ్యవస్థల పనితీరును క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించి, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పని పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం తపాలా కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులతో నేరుగా మాట్లాడిన కేంద్ర మంత్రి, వారికి అందుతున్న సేవల నాణ్యతపై అభిప్రాయాలను సేకరించారు. సేవల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా, వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనే అంశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజల



అభిప్రాయాల ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఇండియా పోస్ట్‌ను సమూలంగా ఆధునీకరిస్తున్నామని తెలిపారు. తపాలా శాఖ కేవలం ఉత్తరాల పంపిణీ వ్యవస్థ మాత్రమే కాదని, బ్యాంకింగ్, బీమా రంగాల్లోనూ ప్రజలకు విస్తృతమైన సేవలు అందిస్తున్న బలమైన ప్రజా వ్యవస్థగా ఎదుగుతోందని పేర్కొన్నారు.
గత రెండున్నర సంవత్సరాలుగా ఇండియా పోస్ట్‌ను మరింత పటిష్టం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, కార్పొరేట్ సంస్థల స్థాయిలో వేగవంతమైన, నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు తరతరాలుగా తపాలా వ్యవస్థపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పూర్తిస్థాయి వినియోగదారుల కేంద్రకృత విధానంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.
ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరిస్తున్నామని, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను డిజిటల్ విధానంలో బలోపేతం చేస్తున్నామని తెలిపారు. సామాన్య ప్రజలకు సులభంగా, అందుబాటులో ఉండే విధంగా పోస్టల్ సేవలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.
బీఎస్ఎన్ఎల్ సేవలపై ప్రత్యేక పర్యవేక్షణ
తపాలా కార్యాలయాల తనిఖీల అనంతరం భోపాల్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్, సాంకేతిక మౌలిక సదుపాయాల పనితీరును కూడా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా హైస్పీడ్ కనెక్టివిటీ, మెరుగైన టెలికాం సేవలు అందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత, పారదర్శకత, వేగం ప్రధాన ప్రాధాన్యతలుగా ఉండాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా తపాలా శాఖ, బీఎస్ఎన్ఎల్ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

పకడ్బందీగా జనగన-2027 ప్రక్రియజిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి





గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 10:

జనాభా గణన – 2027 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి సూచించారు.
గుంటూరు కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో భారత జనాభా గణన-2027లో భాగంగా ఫేజ్-2 జనాభా లెక్కల సేకరణకు సంబంధించి రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి ఆర్ ఓ హాజరై శిక్షణలో పాల్గొన్న జిల్లా సెన్సస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లు, సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. జనాభా గణన ప్రక్రియలో ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జనాభా లెక్కల సేకరణలో ఖచ్చితత్వం, సమన్వయం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నవంబర్ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిశీచిన ఈ శిక్షణా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయం నుంచి విచ్చేసిన ప్రసన్న కుమార్ , జిల్లా కోఆర్డినేటర్స్ ఆదిలక్ష్మి , రమణ తదితరులు శిక్షణ అందించారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా లోని పలువురు తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ: డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు, నవంబర్ 10, (పెన్ పవర్) :

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే అంటువ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఉప్పుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ స్నానం చేయడం, శుభ్రమైన దుస్తులు ధరించడం, భోజనానికి ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలన్నారు. గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవడం ద్వారా వాటిలో పేరుకుపోయే మురికి వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.
అలాగే కలుషిత ఆహారం, అపరిశుభ్రమైన నీటి వినియోగానికి దూరంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. తద్వారా కలరా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువుల్లో నీరు చేరకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం



ఉందని హెచ్చరించారు.
ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని, రోడ్లపై చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, గ్రామ పెద్దలు, వైద్యశాలకు వచ్చిన రోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హరిత శోభితంగా నవ గుంటూరు.. 40 కిలోమీటర్ల మేర భారీ ప్లాంటేషన్ డ్రైవ్.. కమిషనర్ మయూర్ అశోక్





గుంటూరు, పెన్ పవర్:నవంబర్, 10,

గుంటూరు నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి, వాయు కాలుష్యాన్ని తగ్గించి, నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్లాంటేషన్ డ్రైవ్ వేగవంతంగా కొనసాగుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ కే. మయూర్ అశోక్ తెలిపారు. నగరవ్యాప్తంగా 40 కిలోమీటర్లకు పైగా మేర డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.
ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో 25 కిలోమీటర్లు, రెండో దశలో మరో 15 కిలోమీటర్ల మేర డివైడర్లలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యం కలిగిన మొక్కలను ఏపీ గ్రీన్ కార్పొరేషన్ నిపుణుల సూచనలు, సలహాల మేరకు ప్రత్యేకంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.మొక్కలు నాటే ప్రాంతాల్లో డివైడర్లలో ఉన్న పాత మట్టిని పూర్తిగా తొలగించి, మొక్కల ఎదుగుదలకు అనుకూలమైన నాణ్యమైన ఎర్రమట్టి, ఎరువులను వినియోగించి ప్లాంటేషన్ చేపడుతున్నట్లు వివరించారు. ఈ గ్రీన్ ప్రాజెక్టును సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల అంచనా వ్యయంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు.మొక్కలు నాటడంతోనే కార్యక్రమం ముగియకుండా, వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ వెల్లడించారు. నాటిన మొక్కలను రాబోయే రెండేళ్లపాటు పెంచి పోషించడం, నీరు అందించడం, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టడం వంటి పూర్తి బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు తెలిపారు.గుంటూరు నగరంలో పచ్చదనాన్ని విస్తరించి, పర్యావరణ సమతుల్యతను సాధించడంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించడం, నగర ఉష్ణోగ్రతలను తగ్గించడం, నగర సుందరీకరణకు మరింత ప్రాధాన్యత కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని కమిషనర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. హరిత గుంటూరు నిర్మాణం ద్వారా జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి నగరపాలక సంస్థ కృషి చేస్తోందని తెలిపారు.

విజయవాడలో ఘనంగా వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ -- 2026



విజయవాడ, పెన్ పవర్, నవంబరు 10:

యువతలో ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ సంప్రదాయాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ -- 2026 జిల్లా స్థాయి పోటీలు విజయవాడలో ఘనంగా నిర్వహించారు. నవంబరు 10న విజయవాడలోని పీఏసీఎంఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో జిల్లావ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 45 మంది యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఒక దేశం -- ఒకే ఎన్నిక" అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు తమ ఆలోచనలు, అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా వ్యక్తపరిచి ప్రతిభను చాటుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాముఖ్యత, దేశ అభివృద్ధిలో యువత పాత్రపై తమ ప్రసంగాల ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధి అధికారి మధు భూషణ్ రావు, ఎన్టీఆర్ జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి డాక్టర్ కె. రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ పి.టి. పార్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, దేశ భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణ కుమార్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.
పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రథమ బహుమతిగా పి.బి. సిద్ధార్థ కళాశాలకు చెందిన లక్ష్మీ ప్రియ, ద్వితీయ బహుమతిగా మారిస్ స్టెల్లా కళాశాలకు చెందిన నవీనానంది, తృతీయ బహుమతిగా కేబీఎన్ కళాశాలకు చెందిన అమృత్ నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.
ఈ కార్యక్రమాన్ని యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ సంస్థ నిర్వహించింది. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ప్రజాస్వామ్య స్పృహ, నాయకత్వ సామర్థ్యం, జాతీయ సమగ్రత పట్ల నిబద్ధతను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

జనగణన సర్వేను ఖచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, పెన్ పవర్, నవంబరు 10:

జనగణనసర్వేనుఎలాంటిపొరపాట్లకుతావు లేకుండా పూర్తి ఖచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులకు సూచించారు.
మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జనాభా గణన--2027పై జిల్లా సెన్సెస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లు, సాంకేతిక సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్‌పాల్గొనిమాట్లాడారు.
జనగణన ప్రశ్నావళిలోని 40 ప్రశ్నలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ప్రశ్నకు ఒకే ప్రామాణిక విధానంలో సమాధానాలు నమోదు చేయాలని సూచించారు.
సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఇంటింటి సర్వే, రివిజనల్ రౌండ్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ మొదటి రోజు నుంచే రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని విధులు నిర్వహించాలని, సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోజుకు సగటున నాలుగు నుంచి పది ఇళ్ల వివరాలను నమోదు చేయడం ద్వారా నిర్దేశిత సమయంలో సర్వేను పూర్తి చేయవచ్చన్నారు.
2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ ద్వారా వివరాల నమోదు, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి



క్షేత్రస్థాయి జనగణన ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలనిఆదేశించారు. ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించి క్లస్టర్ల వారీగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.
ప్రస్తుతజనగణనడిజిటల్‌విధానంలోజరుగుతున్నం దున వివరాల నమోదులో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకసారి వివరాలను నమోదు చేసి సమర్పించిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదని గుర్తుచేశారు. జనగణన ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, భవిష్యత్ విధానపరమైన నిర్ణయాలు రూపొందుతాయని తెలిపారు. డేటా నమోదు ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ప్రతి కార్యాలయంలో ప్రత్యేక డేటా వెరిఫికేషన్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కుల, మత వివరాల నమోదులో ప్రభుత్వ నిబంధనలు, గెజిట్ ఆదేశాలనుతప్పనిసరిగాపాటించాలని,నిబంధనలక ు విరుద్ధంగా వివరాలు నమోదు చేయరాదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే తహసీల్దార్లు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ ఖాజావలి, సెన్సెస్ కేంద్ర కార్యాలయ శిక్షణ అధికారి ప్రసన్న కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు ఆదిలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెంలో కూటమి విజయంపై ఎమ్మెల్యే మాలకొండయ్య అభినందనలు

చీరాల, నవంబర్ 10, (పెన్ పవర్) :

వేటపాలెం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, సమష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ సజ్జ హేమలత, వేటపాలెం మండల



పార్టీ అధ్యక్షుడు వీరాంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ అక్రమాలపై నవంబర్ 11న రాష్ట్రవ్యాప్త నిరసన సిపిఐ జంగాల అజయ్ కుమార్

గుంటూరు : పెన్ పవర్, నవంబర్, 10,

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అక్రమాలు, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్నాయని, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని, ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే “రెడ్ బుక్ రాజ్యాంగం” వంటి విధానాలను వ్యతిరేకించాలని, రాజ్యాంగ విలువలను పరిరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలు, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా నవంబర్ 11న నిర్వహించే రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ,



సిపిఎం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు

ప్రధాన డిమాండ్లు

రెడ్ బుక్ రాజ్యాంగాన్ని వ్యతిరేకించాలి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

ఎన్నికల స్వతంత్ర వ్యవస్థను రక్షించాలి.

ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి.

జంగాల అజయ్ కుమార్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

కొత్త జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి.. నవ్యాంధ్ర వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా

విజయవాడ, పెన్ పవర్,నవంబర్, 10,

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లను నియమించి, ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ కాలేషా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలుఏర్పాటుచేసిసుమారుఐదు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, ఆయా జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాలు, అసిస్టెంట్ డైరెక్టర్ల నియామకాలు చేపట్టకపోవడం వల్ల దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



దివ్యాంగుల హక్కుల చట్టం--2016 ప్రకారం దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా సంక్షేమ సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త జిల్లాల్లో ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేసి, అసిస్టెంట్ డైరెక్టర్లను నియమించడం ద్వారా దివ్యాంగులకుప్రభుత్వసంక్షేమపథకాలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు.ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని డిప్యూటీ డైరెక్టర్ టి. రవీంద్రను కోరినట్లు షేక్ కాలేషా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ డిజేబుల్డ్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సతీష్ పాల్గొన్నారు.

అద్దెకు ఉంటూ.. యజమాని ఇంట్లోనే చోరీ

నిందితుడి అరెస్ట్.. రూ.3 లక్షల విలువైన 55.200 గ్రాముల బంగారం స్వాధీనం



గుంటూరు:పెన్ పవర్, నవంబర్, 10,

అద్దెకు ఉంటున్న ఇంటి యజమానుల ఇంట్లోనే చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ టి.సీతారాం తెలిపారు. అహ్మద్ నగర్‌లో జరిగిన గృహ దొంగతనం కేసులో నిందితుడు షేక్ మహమ్మద్ రఫీ (28)ను రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన 55.200 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబం వైద్య చికిత్స కోసం విశాఖపట్నం వెళ్లిన సమయంలో నిందితుడు ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు 153 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.5 వేల నగదు అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. సాంకేతిక నిఘా, వేలిముద్రల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన సొత్తు రికవరీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ సూచనల మేరకు తన పర్యవేక్షణలో లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్ఐ వెంకటరావు, హెచ్‌సీ ఎం.కల్యాణ్, పోలీసు సిబ్బంది కిరణ్ కుమార్, పి.శంకర్ సమన్వయంతో కేసును ఛేదించినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

గుంటూరు పట్టణంలో బియ్యం విక్రయాలపై అధికారుల విస్తృత తనిఖీలు

గుంటూరు, పెన్ పవర్:నవంబర్, 10,

గుంటూరు పట్టణంలో బియ్యం విక్రయాలపై పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో గుంటూరు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని గ్రేట్ ఇండియా రైస్ కంపెనీలో సివిల్ సప్లయ్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. బియ్యం విక్రయ ధరలు, తూనికలు, కొలతలు, వ్యాపార నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. వినియోగదారులకు నిర్ణీత ధరలకు నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు.

నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వినియోగదారులను మోసం చేసే విధంగా



వ్యవహరించే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీమతి కోమలి పద్మ, తూనికలు కొలతల అధికారి శ్రీ సైదా, విజిలెన్స్ కమిటీ సభ్యులు శ్రీ చదలవాడ హరిబాబు, గుంటూరు పట్టణ సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహశీల్దార్లు బేగ్, వెంకట్రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

గుణదలలో ఇళ్ల మధ్య వైన్ షాప్.. తిరగబడిన స్థానికులు

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 10,

మహిళలు, బాలికల భద్రతకు ముప్పు అంటూ ఆందోళనవైన్ షాప్ మూసివేయకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరికగుణదల నున్న రోడ్డులో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన వైన్ షాప్‌పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ వైన్ షాప్ కారణంగా మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మద్యం సేవించి షాప్ పరిసరాల్లో కొందరు వ్యక్తులు గుమిగూడుతుండటంతో ప్రశాంతంగా జీవించాల్సిన తమ ప్రాంతంలో అసౌకర్యకర పరిస్థితులు నెలకొంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, నెల రోజుల క్రితం కూడా ఇదే వైన్ షాప్ విషయంలో స్థానికులు తీవ్ర స్థాయిలో



ఆందోళన చేపట్టారు. ప్రజల నిరసనల నేపథ్యంలో అప్పట్లో వైన్ షాప్‌ను మూసివేశారు. అయితే తాజాగా షాప్ యజమాని తిరిగి నిన్న వైన్ షాప్‌ను రీ-ఓపెన్ చేయడంతో స్థానికులు మరోసారి తిరగబడ్డారు. గతంలో ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని మూసివేసిన దుకాణాన్ని మళ్లీ ఎందుకు తెరిచారంటూ ప్రశ్నిస్తున్నారు.ఇళ్ల మధ్య మద్యం దుకాణం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని అధికారులను నిలదీస్తున్నారు. మహిళలు, బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ వైన్ షాప్‌ను మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోకపోతే రాబోయే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పే ప్రభుత్వం.. నివాస ప్రాంతాల్లో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల జీవన ప్రశాంతతను కాపాడాల్సిన అధికారులు, ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే స్పందించి వైన్ షాప్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుణదల నున్న రోడ్డులో వైన్ షాప్ వివాదం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజల నిరసనల నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి

పిల్లల హక్కులు, గౌరవం, సమానత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి ప్రభుత్వ శాఖలకు సూచన

విజయవాడ, పెన్ పవర్, నవంబరు 10:

ప్రభుత్వ దరఖాస్తులు, అధికారిక రికార్డుల్లో తండ్రి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధనను చట్టపరంగా అవసరం లేని చోట తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్‌సీపీసీఆర్) పిలుపునిచ్చింది. తండ్రి పేరు లేకపోవడం కారణంగా ఏ ఒక్క బాలుడు లేదా బాలిక విద్య, గుర్తింపు పత్రాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదని కమిషన్ స్పష్టం చేసింది.విజయవాడలో నవంబరు 10న చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన తండ్రి పేరు తప్పనిసరి కాకుండా చేయడం” అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో కమిషన్ చైర్మన్ వెటుకూరి ఏవీఎస్ఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి బిడ్డకు స్వతంత్ర హక్కులు ఉంటాయని, తల్లిదండ్రుల వైవాహిక స్థితి, కుటుంబ పరిస్థితులు, సామాజిక నేపథ్యం ఆధారంగా పిల్లల భవిష్యత్తును నిర్ణయించకూడదని పేర్కొన్నారు. పిల్లల గౌరవం, గుర్తింపు, సమానత్వం, ప్రాథమిక హక్కులకు ప్రభుత్వ పరిపాలనా విధానాల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, మానవ అక్రమ రవాణా బాధితులు, లైంగిక దోపిడీకి గురైన మహిళల పిల్లలు, సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు తప్పనిసరి కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, గుర్తింపు పత్రాలు, సంక్షేమ పథకాలు పొందడంలో అనవసరమైన అడ్డంకులు ఏర్పడుతున్నాయని తెలిపారు.



ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందంలోని వివక్ష రహిత హక్కు, బాలల శ్రేయస్సు, గుర్తింపు, గోప్యత, అభిప్రాయ వ్యక్తీకరణ, విద్యా హక్కులకు సంబంధించిన నిబంధనలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ వ్యవస్థలు పిల్లల హక్కులను పరిరక్షించేలా ఉండాలని పేర్కొన్నారు.ప్రభుత్వ శాఖలు తమ దరఖాస్తు ఫారాలు, రిజిస్ట్రేషన్ విధానాలు, ఆన్‌లైన్ పోర్టళ్లు, ధ్రువీకరణ ప్రక్రియలను సమీక్షించి, చట్టపరంగా అవసరం లేని చోట తండ్రి పేరు తప్పనిసరి అనే నిబంధనలను తొలగించాలని చైర్మన్ సూచించారు. తల్లి పేరు లేదా చట్టబద్ధమైన సంరక్షకుని వివరాలను ప్రత్యామ్నాయంగా స్వీకరించాలని, తండ్రి పేరు లేని కారణంగా ఏ చిన్నారికి పాఠశాల ప్రవేశం, విద్యా అవకాశాలు, సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించకూడదని స్పష్టం చేశారు.

జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, ఇలాంటి వివక్ష లేదా సేవల నిరాకరణపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని వర్క్‌షాప్‌లో ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలు, బాలల హక్కుల కమిషన్ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పిల్లలకు విద్య, అవకాశాలు నిరాకరించకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు.తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం అనేది తండ్రులను విస్మరించడం లేదా చట్టబద్ధమైన తల్లిదండ్రుల బాధ్యతలను తగ్గించడం కాదని కమిషన్ స్పష్టం చేసింది. చట్టాలకు అనుగుణంగా పిల్లల గౌరవం, సమానత్వం, గుర్తింపు హక్కులను పరిరక్షించేందుకు చేపడుతున్న సమగ్ర పరిపాలనా సంస్కరణగా దీనిని పేర్కొంది.

అన్ని ప్రభుత్వ శాఖల్లో బాలల అనుకూలమైన పత్రాల నమోదు విధానాలను అమలు చేసేందుకు సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు లేదా పరిపాలనా సర్యులర్ జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కమిషన్ విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం.కె. విజయలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, జువైనల్ వెల్ఫేర్ శాఖకు చెందిన పి. రమణారెడ్డి, డీఓజేజేడబ్ల్యూ ఏపీ రాష్ట్ర డైరెక్టర్ వసంతబాల, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శిరీష, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్. సుబ్బారావు, ఏలూరు సీడబ్ల్యూసీ చైర్మన్ పి.వి. రావు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ కుమార్, హెల్ప్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. రామ్మోహన్, ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యులు వి. గాంధీబాబు, చల్లా మధుసూదనరావు, పి. నాగమానస, ప్రోగ్రామ్ మేనేజర్ జెనిఫర్ వై, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్లు, కమిషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళగిరి ఏయిమ్స్ ఆసుపత్రి క్యాంటీన్ భోజనంలో కాళ్ల జెర్రీ

ఆహార నాణ్యతపై రోగుల బంధువుల్లో ఆందోళన.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు

మంగళగిరి: పెన్ పవర్, నవంబర్, 10,

మంగళగిరిలోని ఏయిమ్స్ ఆసుపత్రి క్యాంటీన్‌లో రోగుల బంధువులకు అందించే భోజనంలో కాళ్ల జెర్రీ కనిపించినట్లు ఓ బాధితుడు ఆరోపించడం కలకలం రేపింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కుమార్తెను చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తికి క్యాంటీన్ భోజనంలో జెర్రీ కనిపించడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళగిరి ఏయిమ్స్ ఆసుపత్రికి వచ్చాడు. ఈ క్రమంలో క్యాంటీన్‌లో భోజనం తీసుకోగా, అందులో కాళ్ల జెర్రీ కనిపించినట్లు బాధితుడు వెల్లడించాడు. దీంతో వెంటనే క్యాంటీన్ సిబ్బందిని ప్రశ్నించగా, వారి నుంచి సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం కూడా స్పందించలేదని బాధితుడు ఆరోపించాడు. ఘటన అనంతరం క్యాంటీన్ నిర్వాహకులు భోజనాల



విక్రయాలను నిలిపివేసి, డబ్బులు తిరిగి ఇచ్చినట్లు సమాచారం.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఏయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక ఆసుపత్రిలోనే ఆహార నాణ్యతపై ఇలాంటి ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోగుల బంధువులకు అందించే ఆహారంలోనే పురుగులు కనిపిస్తే, ఆహార భద్రతా ప్రమాణాలు ఏ మేరకు పాటిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

క్యాంటీన్ నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా? ఆహార తయారీలో పరిశుభ్రత పాటిస్తున్నారా? ఈ ఘటనకు బాధ్యులెవరు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

రోగులకు వైద్యం అందించే ఆసుపత్రిలో ఆహార భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై ఏయిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం, ఆహార భద్రతా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు చేపడతారు? అన్నది వేచి చూడాల్సి ఉంది.

మంగళగిరి ఏయిమ్స్ క్యాంటీన్ ఘటనపై అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

2036 ఒలింపిక్స్‌లో భారత్ అగ్రస్థానమే లక్ష్యం కావాలి

క్రీడారంగంలో సమూల సంస్కరణలు అవసరం --

క్రీడాకారులకు భద్రత, వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

చీరాల, నవంబర్ 10, (పెన్ పవర్) :

2036 ఒలింపిక్స్‌లో పతకాల పట్టికలో భారత్ ప్రథమ స్థానాన్ని సాధించాలంటే దేశ క్రీడా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని కోచ్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ఎస్.కె.హెచ్. కబీర్ అభిప్రాయపడ్డారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణతో పాటు భద్రత, ఆర్థిక భరోసా కల్పిస్తూ పారదర్శకమైన క్రీడా వ్యవస్థను నిర్మించాలని ఆయన సూచించారు.

దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం, ఆధునిక శిక్షణ సదుపాయాలు అందక వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఇప్పటి నుంచే దీర్ఘకాలిక కార్యాచరణ



ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని అన్నారు.ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ పాలకవర్గంలో మాజీ క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడా నిపుణులు, సమర్థవంతమైన కార్పొరేట్ ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. క్రీడాకారుల హక్కులు, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య బీమా, ఆర్థిక భద్రతకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడంతో పాటు క్రీడా సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలన్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను గుర్తించి, వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడారంగ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల ఆర్థిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, క్రీడా సంఘాలు, కార్పొరేట్ సంస్థలు సమన్వయంతో పనిచేసి క్రీడాకారులకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నాణ్యమైన కోచింగ్ అందించాలని కబీర్ పేర్కొన్నారు. పటిష్టమైన క్రీడా విధానం, ప్రతిభకు తగిన గుర్తింపు, క్రీడాకారులకు భద్రమైన భవిష్యత్తు కల్పించినప్పుడే అంతర్జాతీయ వేదికపై భారత్ అగ్రస్థానానికి చేరుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహణ

గుంటూరు , పెన్ పవర్, నవంబరు 10:

రాష్ట్రఅటవీఅమరవీరులసంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళగిరి ఎకో పార్క్‌లోని అటవీ అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి పరిరక్షణలో తమ ప్రాణాలనుత్యాగంచేసినఅటవీఅధికారులు,సిబ్బందినిస్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. 1991 నవంబర్ 10వ తేదీన రాజమండ్రికి చెందిన 1979 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్ కర్ణాటకలోని చామరాజనగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండగా గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. దేశానికి ఆయన చేసిన సేవలు, చూపిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం కీర్తి చక్ర పురస్కారం ప్రదానం చేశారు. ఆయన అత్యున్నత త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 10వ తేదీని రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1939 నుంచి 2026 వరకు అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణలో విధులు నిర్వహిస్తూ 25 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బందితమప్రాణాలను త్యాగం చేశారని అధికారులు పేర్కొన్నారు. అక్రమ కలప రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, తీవ్రవాదుల దాడులు, వన్యప్రాణుల దాడులు, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో విధులు





నిర్వహిస్తూ అమరులైన సిబ్బంది సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి, అటవీ దళాల అధిపతి డాక్టర్ పి.వి. చలపతి రావు, ఐఎఫ్ఎస్ పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి పరిరక్షణలో అమరులైన సిబ్బంది త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.అలాగే ఎం. రేవతి, ఐఎఫ్ఎస్, పీసీసీఎఫ్ (విజిలెన్స్ అండ్ ప్రాసిక్యూషన్), బి. సుందర్, ఐఎఫ్ఎస్, ఏపీసీసీఎఫ్ (అడ్మిన్ అండ్ ఐటీ),ఆర్. కొండల్ రావు, ఐఎఫ్ఎస్, సీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), ఎన్. నాగేశ్వరరావు, ఐఎఫ్ఎస్, సీసీఎఫ్ (హెచ్ఆర్డీ అండ్ సీజెడ్ఎం), బి.ఎన్.ఎన్. మూర్తి, ఐఎఫ్ఎస్, సీసీఎఫ్ (ఏపీ గ్రీన్), వై. శ్రీనివాస రెడ్డి, ఐఎఫ్ఎస్, సీసీఎఫ్ గుంటూరు, నందిని సలారియా, ఐఎఫ్ఎస్ (ఈడీ, ఏపీఎఫ్‌డీసీ), హిమశైలజ, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, డీఎఫ్ఓ గుంటూరుతో పాటు అటవీ శాఖ, ఏపీఎఫ్‌డీసీకి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అడవులు పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, ప్రజల జీవనోపాధికి ఎంతో కీలకమని తెలిపారు. అటవీ సంపదను అక్రమ రవాణా, ఆక్రమణల నుంచి రక్షించేందుకు అటవీ శాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అమరులైన అటవీ సిబ్బంది త్యాగాలు అటవీ శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, వారి ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

అటవీ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం -- వారి ధైర్యం మనందరికీ స్ఫూర్తిదాయకం" అని ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజల నిర్వహణపై వివాదం! అమ్మవారి కంకణాల పంపిణీ, విక్రయాలపై భక్తుల అభ్యంతరం

నరసరావుపేట, పెన్ పవర్ నవంబర్ 10:

పల్నాడుజిల్లానరసరావుపేటమండలం ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజల నిర్వహణ, భక్తులకుకంకణాలు,గుమ్మడికాయలపంపిణీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అమ్మవారి పూజా కార్యక్రమాల్లో సమర్పించకుండానే భక్తులకు కంకణాలు, గుమ్మడికాయలు అందజేస్తున్నారంటూ కొందరు భక్తులు మంగళవారం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ సంప్రదాయాలు, ఆచారాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.మహంకాళి అమ్మవారి కంకణానికి భక్తుల్లో ఎంతో పవిత్రత, అపారమైన విశ్వాసం ఉంది. అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించినఅనంతరంఅందించేకంకణాన్నిభక్తులుఎంతోభక్తిశ్రద్ధలతో స్వీకరిస్తుంటారు. అయితే అమ్మవారి పూజల్లోసమర్పించకుండానేకంకణాలనువిక్రయిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా ఆలయం వెనుకవైపు ఉన్న పూజారుల



నివాసాలవద్దకంకణాలవిక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలువినిపిస్తున్నాయి.ఆలయపరిసరాల్లో ప్రైవేటుగావిక్రయాలుజరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారి పేరుతో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తుల విశ్వాసాలనువ్యాపారధోరణులకువేదికగామార్చకూడదని భక్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారం కొనసాగితే ఆలయ ప్రతిష్టకు భంగం కలగడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించేనా?

ఈవ్యవహారంపైఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) స్పందనఏమిటి? కంకణాల పంపిణీ, విక్రయాలవెనుక ఉన్న వాస్తవాలపై విచారణ చేపడతారా? ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహిస్తున్నారా లేదాఅనేఅంశాలనుదేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించాల్సినఅవసరంఉందనిభక్తులుకోరుతున్నారు .మహంకాళి అమ్మవారి ఆలయంలో జరుగుతున్నట్లు చెబుతున్న ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని,ఆలయపవిత్రతను,భక్తులవిశ్వాసాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వికాస్ విద్యాసంస్థల్లో ఘనంగా హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్ కర్సివ్ రైటింగ్‌లో మెలకువలునేర్చుకున్న విద్యార్థులు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 10 :

చిలకలూరిపేటపట్టణంలోనిస్థానికవికాస్‌విద్యాసంస్థల్లో నవంబర్ 10 మరియు 11 తేదీలలో హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్ అత్యంత ఘనంగా నిర్వహించారు.వికాస్ విద్యాసంస్థలఆధ్వర్యంలోపెదనందిపాడురోడ్ క్యాంపస్ అలాగేసుబ్బయ్యతోట విఐఐటి ది స్కూల్‌లో విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.జాతీయ స్థాయి 'బెస్ట్ క్యాలిగ్రాఫర్ అవార్డు' గ్రహీత వై. మల్లికార్జునరావు ఈ వర్క్‌షాప్‌నకు విచ్చేసి విద్యార్థులకుకర్సివ్‌హ్యాండ్‌రైటింగ్‌లోమెలకువలను,అందమైన చేతిరాతకు సంబంధించిన వివిధ పద్ధతులను సులభంగా వివరించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్నవిద్యార్థులు



ఎంతోఉత్సాహంగా,పెద్దసంఖ్యలోభాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా క్యాలిగ్రాఫిస్ట్ మల్లికార్జునరావు మాట్లాడుతూ,కర్సివ్ రైటింగ్‌ను అభ్యసించడం ద్వారా పరీక్షల్లో సమయం ఆదా కావడంతో పాటు విద్యార్థుల్లో ఏకాగ్రత, పనుల పట్ల అంకితభావం పెరుగుతాయని పేర్కొన్నారు.విద్యార్థులు అక్షరాలను స్పష్టంగా, వేగంగా రాయడానికి ఇలాంటి శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఆయన తెలిపారు.వికాస్ స్కూల్స్ డైరెక్టర్ దండా పవన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులలోనిసృజనాత్మకతను వెలికితీసేందుకు 2014 సంవత్సరం నుండి ప్రతి ఏటా నిపుణులతో ఇలాంటి హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్‌లను క్రమం తప్పకుండానిర్వహిస్తున్నట్లువెల్లడించారు.విద్యార్థులసర్వతోముఖాభివృద్ధికి, నైపుణ్యాల మెరుగుదల కోసం భవిష్యత్తులోనూ ఇలాంటి సత్కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని డైరెక్టర్లు దండా పవన్ కుమార్ మరియు రోజశ్రీ స్పష్టం చేశారు.

నూతన మేయర్ జె.బి. శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎఫ్ఆర్‌టీఐ నేతలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 10:

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ జె.బి. శ్రీనివాస్ (మన్నెం శ్రీనివాస్ ప్రసాద్) ను ఫోరం ఫర్ ఆర్‌టీఐ (ఎఫ్ఆర్‌టీఐ) జాతీయ సహాయ కార్యదర్శికుప్పాలఅజయ్‌ప్రసన్నకుమార్ నేతృత్వంలోని బృందం మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది.

ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎఫ్ఆర్‌టీఐ ఆధ్వర్యంలోనిర్వహిస్తున్నమానవహక్కులు, లోకాయుక్త, సమాచారహక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలను వివరించారు. నూతన మేయర్‌గా ఎన్నికైన జె.బి. శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతీకగా మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు.తిరుపతి నగరంలో తాగునీటి సమస్యల పరిష్కారం, పచ్చదనం పెంపొందించడం, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎఫ్ఆర్‌టీఐ నేతలు కోరారు. మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

దీనిపై మేయర్ జె.బి. శ్రీనివాస్ స్పందిస్తూ, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల



సమన్వయంతో నగరంలోని ప్రజా సమస్యలను పరిష్కరించి, సామాన్య ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌టీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరాటే డి.సి.ఎస్. రాయల్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ నారాయణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్, టౌన్ సెక్రటరీ ఎం. శివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు జి. సూర్యకుమారి, తిరుమల అధ్యక్షుడు పి. నాగరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు సుందరమూర్తి రాయల్, ప్రవీణ్, జి. వేణు, టి. శ్రీనివాసులు, బాసికర్ల రఘు, టి. కిరణ్, జి.ఎస్. రమణయ్య, కుమార్, దేవేంద్ర, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నరసరావుపేటలో సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుల కట్టుదిట్టమైన భద్రత

నరసరావుపేట, పెన్ పవర్ నవంబర్ 10:

రాబోయేనరసరావుపేటమున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలపరిరక్షణ,ఎన్నికలసమయంలోఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం సాయుధ బలగాలతో పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఏఆర్ డీఎస్పీ గాంధీ రెడ్డి పర్యవేక్షణలో నరసరావుపేట రైల్వే స్టేషన్ గేటు నుంచి ఆర్డీవో కార్యాలయం, క్లాక్ టవర్, మల్లమ్మ సెంటర్ మీదుగా ఆవుల సత్రం వరకు, అక్కడి నుంచి నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వరకు సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ సాగింది.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా



తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని భరోసా కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ఫ్లాగ్ మార్చ్‌లో నరసరావుపేట ఒకటో పట్టణ, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ల సీఐలు ఫిరోజ్, సురేంద్రబాబుతో పాటు ట్రాఫిక్ సీఐ లోకనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాస భక్తుల సౌకర్యార్థం కాలువల మరమ్మతులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముందస్తు చర్యలు



నరసరావుపేట, పెన్ పవర్ నవంబర్ 10:

పవిత్ర కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదేశించారు. మంగళవారం లింగంగుంట్ల ఏరియా ఆసుపత్రి సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కాలువలు, డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి దేవాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్ప మాలధారులు విచ్చేసే అవకాశం ఉన్నందున, పరిసరాల్లో ఎక్కడా పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, కాలువల పూడికతీత మరియు మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనలో ఎటువంటి రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ప్రజా సంఘాల డిమాండ్

విద్యార్థి పై ఉపాధ్యాయుడు దాడి..

నరసరావుపేట, పెన్ పవర్ నవంబర్ 10:

నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్ లో గల ఆక్స్ఫర్డ్ పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయుడు కోటి అకారణంగా జాజం నాగ కమల్ అనే విద్యార్థి పై తీవ్రస్థాయిలో దాడి చేశాడు. సదరు విద్యార్థి కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పాత్రికేయులతో కలసి పాఠశాల వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న మొదటి పట్టణ పోలీసులు పాఠశాల వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. ఓ విద్యార్థినిని మరో విద్యార్థి అల్లరి చేస్తున్నాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయునికి తెలపడంతో అతను ఈ ఘటనకు సంబంధం లేని విద్యార్థిపై కర్రతో నేరస్తుని కొట్టినట్లు తీవ్రస్థాయిలో దాడి చేశాడు. చూపుడువేలీకి కూడా గాయమైంది. ఈ మేరకు పోలీసులు బాధితుని తల్లి వద్ద నుండి వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో పాఠశాల నిర్వాహకులు రాజి యత్నాలు మొదలుపెట్టి విద్యార్థి కుటుంబ సభ్యులను ఎటువంటి ఫిర్యాదు ఇవ్వద్దని బ్రతిమాలుకుని అక్కడ నుంచి పంపించి వేశారు. ఈ మేరకు స్టేషన్కు వచ్చి స్టేట్మెంట్ ఇవ్వవలసిందిగా పోలీసులు బాధితుని కుటుంబ సభ్యులకు సూచించి అక్కడినుండి గుమి కూడిన ప్రజలను పాత్రికేయులను బాధితుని కుటుంబ సభ్యులను పంపించివేశారు. ఈ విషయమై





మొదటి పట్టణ ఎస్ఐ అరుణను వివరణ కోరగా విచారిస్తున్నామని బాధితులనుండి తమకు ఫిర్యాదు అందలేదని తెలిపినట్లు సమాచారం. జరిగిన ఘటనపై ప్రజాసంఘాలు భగ్గు మంటున్నాయి. గతంలో కూడా ఆక్స్ఫర్డ్ స్కూల్ పై పలు ఆరోపణలు వచ్చాయని అప్పట్లో స్కూల్ పై అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తల్లి తండ్రులు ఆరోపించారు.

జాతీయ రహదారిపై ప్రమాదం: అయ్యప్ప భక్తుడు మృతి మృతుడు ప్రకాశం జిల్లా కు చెందిన పల్లా వేణు (45)



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, నవంబర్ 10 :

చిలకలూరిపేట నాదెండ్ల పరిధి గణపవరం 16వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యువకుడురోడ్ ప్రమాదం లో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడిని ప్రకాశం జిల్లా కరువాది గ్రామానికి చెందిన పల్లా వేణు (45)గా పోలీసులు గుర్తించారు.

మంగళవారం ఆయన ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళుఖతుండగా జాతీయ రహదారిపై బైకు రోడ్డు ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో వేణు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రిని కలిసిన నెల్లూరు మేయర్...

నెల్లూరు (పెన్ పవర్ స్టేట్ బ్యూరో):

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యశాఖ మంత్రి గౌరవనీయులు వై. సత్యకుమార్ యాదవ్ ని విజయవాడ లో మినిస్టర్స్ రెసిడెన్సీ నందు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యి శాలువాతో సత్కరించిన ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన నెల్లూరు నగర మేయర్ రూప్ కుమార్ .అనంతరం రూప్ కుమార్ ని వై. సత్య కుమార్ యాదవ్ శాలువ కప్పి, అత్యంత ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గణేశం వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేద బాధితులకు కొండంత అండ..

మానవత్వానికి మారుపేరు తిరుపతి టౌన్ డీఎస్పీ భక్తవత్సలం

- బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ.. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచుతున్న అధికారి

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 10:

పేదలు, బలహీన వర్గాల బాధితులకు అండగా నిలుస్తూ,ప్రజలకున్యాయపరమైన మార్గదర్శకత్వం అందిస్తున్న తిరుపతి టౌన్ డీఎస్పీ ఎం. భక్తవత్సలంప్రజాసేవలోమానవత్వానికిప్రతిరూపంగానిలుస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.

బాధితుల సమస్యలను ఓపికగా ఆలకిస్తూ, చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను సూచించడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలుస్తోంది. గత ఏడాది కాలంగా వివిధ వ్యక్తిగత, కుటుంబ, సామాజిక వివాదాలు, బాధితుల సమస్యల పరిష్కారం కోసం డీఎస్పీ భక్తవత్సలం ని పలుమార్లు కలిసిన అనుభవాల ద్వారా ఆయన విధి నిర్వహణలో చూపుతున్న బాధ్యతాయుత వైఖరి, మానవీయ స్పందన స్పష్టంగా కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

బాధితులు తమ సమస్యలను తెలియజేసినప్పుడు వాటిని శ్రద్ధగా విని, న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై స్పష్టమైన సూచనలు అందించడం బాధితులకు ఎంతో ధైర్యాన్నిస్తోంది. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలిస్తూ, ఇరుపక్షాల వాదనలకు చట్టపరమైన ప్రాధాన్యత ఇవ్వడం పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతోంది.

అదేవిధంగా పోలీసు సిబ్బందితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, విధుల పట్ల నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత, పై అధికారులపట్ల గౌరవా

న్నిప్రదర్శించడంఆయన నాయకత్వ లక్షణాలను ప్రతిబింబిస్తోంది.

అధికారంఅంటే ఆధి

పత్యం కాదు.. బాధ్యత. హోదా అంటే గౌరవం కాదు.. ప్రజల విశ్వాసం. ఈ భావనతోప్రజలకు



సేవలందిస్తున్నడీఎస్పీభక్తవత్సలంఅభినందనీయులని పలువురు పేర్కొంటున్నారు.

పేదబాధితులకున్యాయపరమైనఅండగా నిలుస్తూ,మానవత్వంతో కూడినపోలీసు సేవలను అందిస్తున్న తిరుపతి టౌన్ డీఎస్పీ ఎం. భక్తవత్సలంకి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అనారోగ్య బాధితుడికి అండగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్

- ఆపదలో ఆదుకోవడమే నిజమైన మానవత్వం.. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

- నిస్వార్థ సేవకు, దాతృత్వానికి మారుపేరుగా నిలుస్తున్న కోలా ఆనంద్

ఏర్పేడు, పెన్ పవర్, నవంబర్ 10:

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, నిరుపేదల కష్టాల్లో పాలుపంచుకుంటూ నిస్వార్థ సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ దాతృత్వాన్ని పార్టీ నాయకులు కొనియాడారు. సమాజ సేవే లక్ష్యంగా, ఎలాంటి స్వార్థం లేకుండా ఆయన అందిస్తున్న సహాయ సహకారాలు పలువురు బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పేడు మండలం కోబాక పంచాయతీకి చెందిన తిన్నాటి సుబ్రమణ్యం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కోలా ఆనంద్ స్పందించి, ఆయన వైద్య చికిత్సకు తోడ్పాటుగా రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ కార్యకర్తల సమక్షంలో ఈ ఆర్థిక సాయాన్ని అందించడం ద్వారా బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా కోలా ఆనంద్ చరవాణి ద్వారా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు,



నిరుపేదలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో చేసే సేవా కార్యక్రమాలు బాధితుల జీవితాల్లో ఆశాకిరణాలుగా నిలుస్తాయని, కష్టాల్లో ఉన్నవారికి మనోధైర్యాన్ని అందిస్తాయని తెలిపారు. సమాజంలో సేవాభావం, పరస్పర సహకారం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని చాటుతూ కోలా ఆనంద్ అందించిన ఆర్థిక సహాయం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

- పోషణ్ భి పడాయి భి కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్ ,నవంబర్ 10:

చిన్నారుల్లో పోషణ, ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా శ్రీకాళహస్తి రూరల్ మండల అంగన్వాడీ కార్యకర్తలకు బాయ్స్ హైస్కూల్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ శాంతిదుర్గ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ బాలయ్య, హెడ్మాస్టర్ వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఆరేళ్లలోపు పిల్లల సమగ్ర అభివృద్ధి, బాల్య ప్రాథమిక విద్యను మెరుగుపరచడంపై శిక్షణలో ప్రత్యేక దృష్టి సారించారు. చిన్నారుల అభివృద్ధి



దశలు, పోషణ్ పక్వాడ, ఎదుగుదల పర్యవేక్షణ, పోషకాహార లోపం ఉన్న పిల్లల నిర్వహణ, పోషణ్ ట్రాకర్ యాప్ వినియోగం, గృహ సందర్శన షెడ్యూల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ కార్యకర్తలకు గ్రూప్



యాక్టివిటీస్, ప్రదర్శనల ద్వారా ఆచరణాత్మక శిక్షణ అందించారు.

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు నాణ్యమైన బాల్య విద్య అందించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో పంచాయతీ సమరం: 3 విడతల్లో సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ!

నెల్లూరు, నవంబర్ 10, పెన్ పవర్ స్టేట్ ఇంచార్జ్.

నెల్లూరు జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రకటన వెలువడటంతో పల్లెల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. స్థానిక సంస్థల సమరానికి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేయడంతో, జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేపట్టింది.

మొత్తం 35 మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో (3 Phases) సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

విడతల వారీగా ఎన్నికల షెడ్యూల్:

మొదటి విడత (నవంబర్ 26):

పరిధి: కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాలు.

తొలి విడతలోనే ప్రధాన పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండటంతో ఆయా గ్రామాల్లో ప్రచార పర్వం ఊపందుకుంది.

రెండో విడత (నవంబర్ 29): పరిధి: ఆత్మకూరు మరియు గూడూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 12 మండలాలు.

ఈ డివిజన్లలో నామినేషన్ల ఘట్టం పూర్తికాగానే అభ్యర్థుల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా మారింది.

మూడో విడత (డిసెంబర్ 2):పరిధి: నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలు.

చివరివిడతతోజిల్లావ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలప్రక్రియ ముగియనుంది.



వెంటనే ఫలితాల వెల్లడి!ప్రతి విడతలోనూ ఉదయం నుంచిమధ్యాహ్నంవరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన వెంటనేఆయాకేంద్రాల్లోలెక్కించడం(ఓట్లలెక్కింపు)ప్రారంభించి,అదే12 సాయంత్రానికల్లాఫలితాలను వెల్లడించనున్నారు.

సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు స్థానిక నాయకులు, అభ్యర్థులు వ్యూహప్రతివ్యూహాలకు పదునుపెడుతున్నారు. పల్లెల్లో రచ్చబండల వద్ద రాజకీయ చర్చలు జోరందుకోవడంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

పవన్ కళ్యాణ్ ఆశయాలు & పొంగూరు నారాయణ మార్గదర్శకత్వంలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు కార్పొరేటర్ విజయలక్ష్మికి సచివాలయ సిబ్బంది అభినందనలు!



నెల్లూరు, నవంబర్ 10, పెన్ పవర్ స్టేట్ ఇంచార్జ్.

నెల్లూరు నగరం 21వ డివిజన్‌లో ప్రజాప్రతినిధి, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయ సమావేశం నెల్లూరు నగరంలోని 21వ డివిజన్ కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి గారిని సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జనసేనా నాయకులు కిషోర్ గునుకుల మాట్లాడుతూ జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ఆకాంక్షించినరాజకీయజవాబుదారీతనం,పారదర్శకమైన పాలన, ప్రజలకు నేరుగా సేవలందించే నూతన రాజకీయ సంస్కృతికి అనుగుణంగా, పురపాలక శాఖ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరునారాయణమార్గదర్శకత్వంలోసచివాలయ వ్యవస్థ ఎంతో నైపుణ్యంతో, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తోందని ప్రశంసించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడంలో సచివాలయ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గతంలో కూడా సచివాలయ సిబ్బంది సహకారంతో అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామని, ఇప్పుడు ప్రజాప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన గునుకుల విజయలక్ష్మికి అభినందనలు తెలియజేయడంతో పాటు, భవిష్యత్తులో మరింత సమన్వయంతో ప్రజలకు సేవలందించాలనే ఉద్దేశంతో సిబ్బంది ఆమెను కలిశారని తెలిపారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయలక్ష్మి గునుకుల మాట్లాడుతూ,ప్రజలుతమసమస్యలతోసచివాలయానికి వచ్చినప్పుడు వారితో ఓపికగా, ప్రేమగా, గౌరవంగా వ్యవహరించాలని, చిన్న సమస్యనైనా నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.

మనమందించే చిన్న సేవ కూడా ఒక కుటుంబ జీవితంలో గొప్ప మార్పును తీసుకురాగలదని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విషయంలో సచివాలయ సిబ్బందికి పూర్తి సహకారం అందిస్తానని, ప్రతి విభాగంలోనూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని విజయలక్ష్మి గునుకుల తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, ప్రశాంత్ గౌడ్,తెలుగుదేశం నాయకులు చంద్రా మదు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు పటిష్ట చర్యలు: జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

- రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో నిల్వల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి.

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు.

- రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీపై బియ్యం, ఎర్రగడ్డలు విక్రయం

నెల్లూరు, నవంబర్ 10: పెన్ పవర్ స్టేట్ ఇంచార్జ్.

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, నిల్వల పర్యవేక్షణకు పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు.

మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగాజాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీన జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం రైస్ మిల్లర్లు,



హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను ఈ నెల 13వ తేదీలోగా ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం నిల్వల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. నిల్వలను దాచిపెట్టడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బహిరంగ మార్కెట్లో నాణ్యమైన బియ్యం ధర కిలో రూ. 80 వరకు పలుకుతున్న నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో అధికంగా వినియోగించే బిపిటి (BPT), కేఎన్ఎం (KNM) రకాల నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ. 66 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. కావలి, గూడూరు, పొదలకూరు, నెల్లూరు నగరంలోని రెండు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టామన్నారు. మరో రెండు మూడు రోజుల్లో జిల్లా సహకార అధికారి సమన్వయంతో ప్రతి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (PACS) ద్వారా కూడా బియ్యం అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

అలాగే మార్కెట్లో ఉల్లి ధర కిలో రూ. 50కు పైగా ఉన్న నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కిలో రూ. 35 చొప్పున రాయితీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క వినియోగదారునికి రెండు కిలోల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటికే ఫతేఖాన్‌పేట మార్కెట్లో ప్రత్యేక విక్రయ స్టాల్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఈ రాయితీ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పుల్లయ్య, లక్ష్మీనారాయణ, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హోల్‌సేల్, రిటైల్ డీలర్లు పాల్గొన్నారు.

59 వ డివిజన్ కార్పొరేటర్ దర్శి హరికృష్ణను పరామర్శించి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి



నెల్లూరు, నవంబర్ 10, పెన్ పవర్ స్టేట్ ఇంచార్జ్.

ఇటీవల బైక్ ప్రమాదానికి గురై చికిత్స పొంది, నెల్లూరు నగరంలోని బారకాస్ సెంటర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న 59వ డివిజన్ కార్పొరేటర్ దర్శి హరికృష్ణ ను నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి ఈరోజు పరామర్శించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున 59వ డివిజన్ కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించిన సందర్భంగా దర్శి హరికృష్ణకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

దర్శి హరిక్రిష్ణ ను చేజర్ల వేంకటేశ్వర రెడ్డి తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు



పి.ఎల్. రావు, వరికుంట్ల సురేష్ (రాజా సురేష్), అమ్ముల షేక్, షేక్ రసూల్, కంచి జ్ఞానేంద్ర తదితరులు కూడా పరామర్శించి, కార్పొరేటర్ గా విజయం సాధించినందుకు అభినందనలు తెలియచేశారు. అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఏటూరి రమేష్ బాబు, కసుమూరు సురేంద్ర, రమణ, శ్రీనివాస ఆచారి, మల్లి, అలీ, సుజ, విజయలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రిని కలిసిన నెల్లూరు మేయర్...

నెల్లూరు (పెన్ పవర్ స్టేట్ బ్యూరో):

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యశాఖ మంత్రి గౌరవనీయులు వై. సత్యకుమార్ యాదవ్ ని విజయవాడ లో మినిస్టర్స్ రెసిడెన్సీ నందు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యి శాలువాతో సత్కరించిన ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన నెల్లూరు నగర మేయర్ రూప్ కుమార్ . అనంతరం రూప్ కుమార్ ని వై. సత్య కుమార్ యాదవ్ శాలువ కప్పి, అత్యంత ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు



ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గణేశం వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ స్టడీ సర్కిళ్లలో స్టైపెండ్ పెంపు..

నవంబర్ 10: పెన్ పవర్

తెలంగాణలోని బీసీ స్టడీ సర్కిళ్లలో కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థికంగా శుభవార్త అందించింది. సివిల్స్ అభ్యర్థుల స్టైపెండ్ను రూ. 5 వేల నుండి రూ. 7 వేలకు, బుక్ ఫండ్ను రూ. 10 వేలకు పెంచారు. గ్రూప్స్, బ్యాంకింగ్ అభ్యర్థులకు స్టైపెండ్ను రూ. 1,500కు పెంచుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంపు నవంబర్ నెల నుంచే అమల్లోకి వస్తుందని వెల్లడించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆర్థిక భారం తగ్గుతుందని అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలకలూరిపేటలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు పోలీసులకు ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 10 :

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై చిలకలూరిపేటలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై జనసేన నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెంటేల బాలాజీ, మండలనేని చరణ్ తేజ, 16వ వార్డు జనసేన కౌన్సిలర్ వంకాయలపాటి సింగారావు, 17వ వార్డు జనసేన కౌన్సిలర్ పెద్దింటి సుమలత, 26వ వార్డు జనసేన కౌన్సిలర్ అన్నపరెడ్డి దివ్య, అలాగే సుభాని, భాషా, జీవన్ కుమార్, గల్లా శ్రీనివాసరావు, ఎం.వి. ప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ.. ఎవరి వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూడటం చట్టరీత్యా నేరమని, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదన్నారు. ఇలాంటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ ఎవరైనా ఇలాంటి తప్పులకు



పాల్పడితే, జనసేన కార్యకర్తలు సహించబోరని,చట్టపరమైన చర్యలతో పాటు తగిన విధంగా బుద్ధి చెబుతామని తీవ్రంగా హెచ్చరించారు.

పవన్ విడాకులు.. అసలు చట్టం ఏం చెబుతోంది!



పవన్ కళ్యాణ్, అన్నా లెజ్నెవా విడాకుల వార్తల నేపథ్యంలో మ్యూచువల్ కన్సెంట్ డివోర్స్‌పై చర్చ జరుగుతోంది. భారత చట్టాల ప్రకారం విడిపోవాలని ప్రకటన చేసినంత మాత్రాన విడాకులు పూర్తికావు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, నిర్దేశిత ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే విడాకులు మంజూరవుతాయి. పిల్లల కస్టడీ, భరణం, ఆస్తుల అంశాలను కూడా కోర్టు పరిశీలిస్తుంది.

పవన్ కళ్యాణ్, అన్నా లెజ్నెవా 13 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు రిపోర్ట్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇద్దరూ పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అయితే భార్యాభర్తలు ఇద్దరూ విడిపోవడానికి అంగీకరిస్తే వెంటనే విడాకులు వచ్చేస్తాయా, కోర్టులో ఎలాంటి ప్రక్రియ ఉంటుంది, పిల్లల బాధ్యతలు, భరణం వంటి విషయాలను ఎలా నిర్ణయిస్తారనేది అందరిలో కలుగుతున్న సందేహాలు.

ఇక భారత చట్టాల ప్రకారం భార్యాభర్తలు ఇద్దరూ అంగీకరించి విడాకులు తీసుకునే విధానాన్ని 'డివోర్స్ బై మ్యూచువల్ కన్సెంట్' అంటారు. ఇందుకోసం ఇద్దరూ కలిసి కోర్టులో పిటిషన్ దాఖలు చేయవచ్చు. అయితే కేవలం విడిపోతున్నట్లు ప్రకటన ఇచ్చినంత మాత్రాన చట్టపరంగా వివాహ బంధం ముగిసినట్లు కాదు. కోర్టు విడాకుల ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతే ఆ ప్రక్రియ పూర్తవుతుంది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 28 ప్రకారం పరస్పర అంగీకారంతో విడాకులు కోరుకునే దంపతులు కనీసం ఏడాది పాటు విడిగా జీవించి ఉండాలి. ఒకే ఇంట్లో ఉన్నా భార్యాభర్తలుగా కలిసి జీవించకపోతే కొన్ని సందర్భాల్లో దానిని విడిగా ఉన్నట్లుగానే పరిగణిస్తారు. అయితే ఆ పరిస్థితులను కోర్టు పరిశీలిస్తుంది. నార్మల్ గా పిటిషన్ దాఖలు చేసిన ఆరు నెలల తర్వాత ఇద్దరూ మరోసారి తమ అంగీకారాన్ని కోర్టుకు తెలియజేయాలి. దీనిని సెకండ్ మోషన్ అంటారు.

దంపతులు తమ నిర్ణయాన్ని మరోసారి ఆలోచించుకోవడానికి ఈ గడువు ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆరు నెలల గడువును మినహాయించే అవకాశం కూడా ఉంది. ఇద్దరి మధ్య సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదని కోర్టు భావిస్తే, వర్తించే చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. ఇక భరణం, పిల్లల కస్టడీ, ఆస్తుల వ్యవహారాలను కూడా విడాకుల సమయంలో పరిష్కరించుకుంటారు.

భార్యాభర్తలు వీటిపై ముందుగానే అంగీకారానికి రావచ్చు. పిల్లల విషయంలో వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తారు. తల్లిదండ్రులు చేసుకున్న ఒప్పందాన్ని కూడా కోర్టు పరిశీలించవచ్చు. పవన్, అన్నా వేర్వేరు మతాలకు చెందినవారు కావడంతో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ ప్రస్తావన వస్తోంది. అయితే వారి వివాహం ఏ చట్టం కింద నమోదైందనే దానిపైనే విడాకులకు వర్తించే నిబంధనలు ఆధారపడి ఉంటాయి. ఇక ఇద్దరూ పిల్లల బాధ్యతలను కలిసి చూసుకుంటామని ప్రకటనలో ఉంది. ఇక నెక్స్ట్ ఈ విషయంలో ఈ ఇద్దరి నుంచి మరో క్లారిటీ ఏమైనా వస్తుందేమో చూడాలి.

ఆ వార్తలు ఓవైపు.. ప్రజా నాయకుడిగా పవన్ ఇలా!



భార్య అన్నా కొణిదెలతో పవన్ కళ్యాణ్ విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలపై చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనూ పవన్ తన ప్రభుత్వ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరయ్యారు. అయితే వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలకు పవన్ స్పందిస్తే స్పష్టత వస్తుందని అభిమానులు భావిస్తున్నారు.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి కొన్ని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. భార్య అన్నా కొణిదెలతో విడిపోతున్నారంటూ మీడియాలో రిపోర్ట్స్ రావడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్తలపై రకరకాల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి సమయంలోనూ పవన్ తన ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉండటం హైలెట్ అవుతోంది. వ్యక్తిగతంగా ఏం జరుగుతున్నా డిప్యూటీ సీఎంగా తన పనులను కొనసాగిస్తున్నారు.మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి పవన్ హాజరయ్యారు. ఇతర మంత్రులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. చంద్రబాబుతో కలిసి నడుస్తున్న ఫొటోలతో పాటు కేబినెట్ సమావేశంలో ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో పవన్ ఎప్పటిలాగే కనిపించారు.నిజానికి పవన్ వ్యక్తిగత జీవితం గురించి గతంలోనూ చాలాసార్లు వార్తలు వచ్చాయి. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా ఆయన పెళ్లిళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు మరోసారి అలాంటి వార్తలు వస్తున్నా పవన్ మాత్రం వాటిపై ఎలాంటి స్పందన ఇవ్వకుండా తన పనుల్లో ఉన్నారు.ఇక్కడ రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితం వేరు అనే కోణం కూడా ఉంది. ఒక వ్యక్తి కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం ఒక అంశమైతే, ప్రజలు ఎన్నుకున్న నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించడం మరో అంశం. వ్యక్తిగత విషయాలపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉండొచ్చు. కానీ ప్రభుత్వంలో పవన్ ఏం చేస్తున్నారు, తన శాఖలకు ఎంత సమయం కేటాయిస్తున్నారు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారనేది ముఖ్యం.మరోవైపు ప్రస్తుతం వస్తున్న వార్తలపై పవన్ నుంచి క్లారిటీ వస్తే బాగుంటుందని జనసేన అభిమానులు నుంచి కూడా కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశమే అయినప్పటికీ, రాజకీయంగా కీలక స్థానంలో ఉండటంతో ఈ వ్యవహారంపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వస్తున్న రకరకాల కథనాలకు పవన్ స్వయంగా స్పందిస్తే స్పష్టత వస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.పవన్ కళ్యాణ్‌కు జీవితంలో ఇలాంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. సినీ కెరీర్‌లో విమర్శలు, పరాజయాలు, భారీ విజయాలు చూశారు. రాజకీయాల్లోనూ ఓటమి నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి చేరుకున్నారు. ఎన్నో సందర్భాల్లో తనపై వచ్చిన విమర్శలకు నేరుగా సమాధానమిచ్చారు. ఇప్పుడు వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల విషయంలోనూ సరైన సమయంలో స్పందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. మరి పవన్ ఈ అంశంపై క్లారిటీ ఇస్తారా, లేక వ్యక్తిగత వ్యవహారంగా భావించి స్పందించకుండా ఉంటారా అనేది చూడాలి.

పవన్ కోసం.. టీడీపీ, వైసీపీ ఒకే మాట!

పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్నారనే వార్తల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ ఆసక్తికర నిర్ణయం తీసుకున్నాయి. నేతలు, కార్యకర్తలు రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలపై కామెంట్స్ చేయొద్దని రెండు పార్టీలు సూచించాయి. అభ్యంతరకర పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీపీ హెచ్చరించగా, వ్యక్తుల ప్రైవసీని గౌరవించాలని వైసీపీ కోరింది. ఏపీ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకే అభిప్రాయంతో ఉండటం చాలా అరుదు. ముఖ్యంగా టీడీపీ, వైసీపీ మధ్య రాజకీయ విమర్శలు ఏ స్థాయిలో ఉంటాయో తెలిసిందే. అలాంటిది ఇప్పుడు పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తల విషయంలో రెండు పార్టీల నుంచి దాదాపు ఒకే తరహా ప్రకటనలు రావడం ఆసక్తికరంగా మారింది. వ్యక్తిగత విషయాలపై కామెంట్స్ చేయొద్దంటూ తమ పార్టీ శ్రేణులకు సూచనలు జారీ చేశాయి.

పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు కనిపిస్తున్నాయి. గతంలో పవన్ పెళ్లిళ్లపై రాజకీయ ప్రత్యర్థులు పలుమార్లు విమర్శలు చేశారు. ముఖ్యంగా వైసీపీ నేతలు ఎన్నికల సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన సందర్భాలున్నాయి. అయితే ఇప్పుడు అదే పార్టీ వ్యక్తిగత వ్యవహారాలపై ఎవరూ కామెంట్స్ చేయొద్దని చెప్పడం విశేషం. వైసీపీ తన నాయకులు, అధికార ప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులకు నాలుగు సూచనలు చేసింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. అలాంటి పోస్టులపై స్పందించవద్దని, వాటిని షేర్ చేయవద్దని సూచించింది. సంబంధిత వ్యక్తుల ప్రైవసీని గౌరవించాలని కోరింది.మరోవైపు ఐటీడీపీ కూడా ఇదే అంశంపై ప్రకటన ఇచ్చింది. అయితే ఇందులో మరో ఆసక్తికరమైన పాయింట్ ఉంది. కేవలం కూటమి పార్టీల నేతలే కాకుండా వైసీపీ నాయకుల వ్యక్తిగత జీవితాలపై కూడా కామెంట్స్ చేయొద్దని స్పష్టం చేసింది. ఐటీడీపీకి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాల నుంచి



అలాంటి వ్యాఖ్యలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వ్యక్తులు చేసే అభ్యంతరకరమైన కామెంట్స్‌తో తమకు సంబంధం లేదని పేర్కొంది.నిజానికి గత కొన్నేళ్లుగా టీడీపీ, వైసీపీ మధ్య వ్యక్తిగత విమర్శలు కూడా ఎక్కువగానే కనిపించాయి. పవన్ పెళ్లిళ్ల అంశంతో పాటు చంద్రబాబు కుటుంబం, జగన్ వ్యక్తిగత వ్యవహారాలను కూడా రాజకీయ విమర్శల్లో ప్రస్తావించిన సందర్భాలున్నాయి. సోషల్ మీడియాలో రెండు పార్టీల మద్దతుదారుల మధ్య ఇలాంటి పోస్టులు తరచూ కనిపిస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో రెండు వైపుల నుంచి ఒకేసారి ఈ తరహా ప్రకటనలు రావడం హైలెట్ అవుతోంది.అయితే ఈ ప్రకటనలు ఎంతవరకు అమలవుతాయనేది మరో అంశం. ఐటీడీపీ నేరుగా క్రమశిక్షణ చర్యల గురించి హెచ్చరించగా, వైసీపీ మాత్రం తమ శ్రేణులకు సూచనలు ఇచ్చింది. ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసినవారిపై చర్యలు తీసుకున్నట్లు ఈ ప్రకటనల్లో పేర్కొనలేదు. ఇక పవన్ వ్యక్తిగత జీవితంపై వస్తున్న రిపోర్ట్స్ విషయంలో జనసేన నుంచి నేరుగా ఎలాంటి వివరణ రాలేదు. ఇక పవన్ కూడా ఈ విషయంలో ఎలాంటి క్లారిటీ ఇస్తారా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు.

అనంతపురం వైసీపీ మేయర్.. కూటమి పక్కా ప్లానింగ్, ఆ ఒక్కరినీ లాగేస్తారా?!

అనంతపురం మేయర్ రమేశ్ గౌడ్‌ను టీడీపీలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. మేయర్ ప్రమాణ స్వీకారం చేయకముందే ఈ ప్రతిపాదన రావడంతో వైసీపీ అప్రమత్తమైంది. మేయర్ స్థానాన్ని కూటమి లక్ష్యంగా చేసుకుందా అన్న ఊహాగానాలు మొదలయ్యాయి.

అనంతపురం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రతిపక్షం వైసీపీ గెల్చుకున్న అనంత మేయర్ స్థానంపై అధికార కూటమి గురిపెట్టిందనే టాక్ నడుస్తోంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య మాటల యుద్ధం గమనిస్తే జిల్లా రాజకీయాల్లో ఏదో జరగబోతోందన్న సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు అనుమానిస్తున్నారు. అనంతపురం మేయర్ స్థానాన్ని వైసీపీ గెలుచుకుంది.

ఈ నేపథ్యంలో జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళితే ఒక్కరు తిరిగి గెలిచే అవకాశం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా టీడీపీ ఎమ్మెల్యేలు తిరిగి గెలిస్తే తాను రాజకీయాల నుంచి విరమించుకుంటానని సవాల్ చేశారు. దీనిపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సీరియస్ గా స్పందించారు. అంతే కాకుండా వైసీపీ మేయర్ రమేశ్ గౌడ్ వెంటనే టీడీపీలోకి రావాలని లేదంటే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొవాల్సివస్తుందో చెబుతూ హాట్ కామెంట్స్ చేశారు. దీంతో అనంత మేయర్ పై అధికార పార్టీ గురిపెట్టిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే, అనంతపురంలో మాత్రమే వైసీపీ గెలిచింది. మిగిలిన 12 కార్పొరేషన్లను టీడీపీ కూటమి దక్కించుకుంది. అనంతపురం మేయర్ సీటును పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయించడం,



ఆ పార్టీకి సంస్థాగతంగా బలం లేకపోవడం, ఓటు బదిలీ కాకపోవడం వంటి కారణాలతో కూటమి అభ్యర్థి ఓడిపోయినట్లుగా విశ్లేషిస్తున్నారు. అయితే వైసీపీ గెలవడం జిల్లాలోని కూటమి నేతలకు తలకొట్టేసినట్లుగా ఉందని చెబుతున్నారు. దీంతో వైసీపీ నుంచి గెలిచిన మేయర్ రమేశ్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయకముందే పార్టీలోకి లాగేయాలని టీడీపీ కూటమి నేతలు ప్లాన్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే జేసి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తున్నారు.

అగ్గిరాజేసిన జేసీ

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడిన మాటలు సంచలన రాజకీయ చర్చకు తెరతీసింది. తమ ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలని అనంత వెంకటరామిరెడ్డి సవాల్ చేయడాన్ని తప్పుబట్టిన ప్రభాకర్ రెడ్డి వైసీపీ నుంచి గెలిచిన మేయర్ వెంటనే తమతో చేతులు కలపాలని ఆహ్వానం పలుకుతూ విపక్షాన్ని ఉలికిపాటుకు గురిచేశారని చెబుతున్నారు. వైసీపీ తరపున గెలిచిన మేయర్ ఒంటరిగా ఏం చేయలేరని, కార్పొరేషన్లలో ఎక్కువ కార్పొరేటర్లను గెలుచుకున్న కూటమికే బలం ఎక్కువగా ఉందని జేసీ తెలిపారు. కార్పొరేటర్ల మద్దతు లేకుండా మేయర్ ఏం చేయలేరని, అధికార పార్టీలోకి వస్తే నగరాభివృద్ధి జరుగుతుందని జేసీ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో తాను తాడిపత్రి మున్సిపల్ చైర్మనుగా గెలిస్తే ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ ఎదురైందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే మేయర్ రమేశ్ గౌడ్ టీడీపీలో చేరాలని సలహా ఇచ్చారు.

అయితే జేసీ చేసిన సూచన రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. వైసీపీ నుంచి గెలిచిన మేయర్ ను పార్టీలోకి రమ్మంటూ జేసీ పిలుపునివ్వడం వెనుక ఏమైనా రాజకీయ వ్యూహం ఉందా? అన్న చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం ప్రోద్బలంతో జేసీ ఈ వ్యాఖ్యలు చేశారా? లేక స్వతహాగా తన అనుభవంతోనే ఇలాంటి ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చారా? అన్నది తేలాల్సివుందని అంటున్నారు. ఏదిఏమైనా ప్రమాణ స్వీకారం చేయకముందే మేయర్ ను తమ పార్టీలోకి రమ్మంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునివ్వడం తీవ్ర రాజకీయం చర్చగా మారింది. దీనిపై వైసీపీ స్పందన ఎలా ఉంటుందో చూడాల్సివుందని అంటున్నారు.

రాప్తాడు బాలిక ఆరోగ్యంలో కీలక మార్పు.. ప్రాణాపాయం దాటినట్లే!



రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని ఆరోగ్యం మెరుగుపడుతోంది. బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను వైద్యులు ప్రత్యేక వార్డు నుంచి సాధారణ వార్డుకు మార్చారు. ఎడమ చేతి పట్టీ తొలగించడంతో కదిలించగలుగుతోంది. మరోవైపు, పోలీసుల కాల్పుల్లో కుడికాలు కోల్పోయిన నిందితుడు హేమంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతోంది. గత నెల 31న బాలికపై ఉన్మాది దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో బాలిక చికిత్స పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో చిన్నారికి వైద్యులు చికిత్స చేస్తున్నారు. ప్రతి రోజూ ఆమె ఆరోగ్య విషయమై మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ ప్రతిరోజు చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఎక్స్ వేదికగా ప్రకటన చేస్తున్నారు. మంగళవారం చిన్నారి ఆరోగ్యం కుదుటపడిందని ప్రత్యేక వార్డు నుంచి సాధారణ వార్డుకు తరలించినట్లు ఇద్దరు మంత్రులు తెలిపారు.ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు తల, మెడ, ముఖం, చేతులు, వీపుపై గాయాలు అయ్యాయి. వీటికి సోమవారం కట్లు మార్చారు. చికిత్సను తట్టుకున్న బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు స్పష్టం చేశారు. ఆమె ఎడమ చేతికి పట్టీ తొలగించారు. దీంతో చేతిని కదిలించుకునేందుకు వీలు కలిగిందని చెబుతున్నారు. దగ్గినప్పుడు ఛాతీలో నొప్పి వస్తోందని బాలిక చెబుతోందని దీనికి చికిత్స అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇక నోటి ద్వారా ఆహారం తక్కువగా తీసుకుంటుండటం వల్ల ముక్కు ద్వారా గొట్టంతో ఆహారం అందజేస్తున్నారు.బాలిక మరింత వేగంగా కోలుకోడానికి నోటి ద్వారా ఆహారం తీసుకునేలా వైద్యులు ప్రోత్సహిస్తున్నారు. మణి పాల్ ఆస్పత్రి డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ వైద్యుల సమన్వయంతో బాలికకు చికిత్స చేయిస్తున్నారు. ఉన్మాది దాడిలో గాయపడిన బాలిక ప్రాణాపాయం నుంచి బయటపడటంపై అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సత్వర వైద్యం అందడంతో బాలిక వేగంగా కోలుకుంటోందని చెబుతున్నారు. మరోవైపు చిన్నారిపై దాడి చేసిన నిందితుడు హేమంత్ కుంటివాడు అయ్యాడు.నిందితుడు కూడా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దాడి అనంతరం పరారైన నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసులు ఎన్ కౌంటర్ చేశారు. ఈ సమయంలో పోలీసు తూటాలు నిందితుడి కాళ్లలో నరాలను చిద్రం చేశాయి. దీంతో అతడి కుడికాలిని తొడ భాగం నుంచి తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం నిందితుడు కోలుకునేందుకు కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. పూర్తిగా కోలుకున్నాక అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి జైలుకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

పెన్ పవర్

బుధవారం 11 నవంబర్ 2026

తండ్రిని తలపించే బ్యాటింగ్.. సెహ్వాగ్ తనయుడి 160 పరుగుల విధ్వంసం

యూఏఈపై 168 బంతుల్లో ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్

అండర్-19 ఆసియా కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

తొలుత ఆచితూచి ఆడిన ఆర్యవీర్.. కుదురుకున్నాక దూకుడు

తండ్రితో పాటు కోహ్లీ తనకు స్ఫూర్తి అన్న మాటను నిజం చేస్తున్న ఆర్యవీర్



భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్.. తండ్రి తరహాలోనే మైదానంలో దూకుడు చూపించాడు. అండర్-19 ఆసియా కప్ 2026లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ 160 పరుగులతో చెలరేగాడు. 168 బంతులు ఎదుర్కొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే.మ్యాచ్ ఆరంభంలో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. తొలి పరుగులు చేసేందుకు 14 బంతులు తీసుకున్నాడు. క్రీజులో కుదురుకున్నాక మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కీలక మ్యాచ్‌లో అతడి శతకం భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపింది. చివరకు 168 బంతుల్లో 160 పరుగులు చేసి ఔటయ్యాడు. 153 పరుగుల వద్దే ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించాడు.

తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేసేవాడు.

అయితే ఆర్యవీర్ తన ఆటతీరులో తండ్రి దూకుడుతో పాటు విరాట్ కోహ్లీ నుంచి స్ఫూర్తి పొందుతున్నట్లు గతంలో వెల్లడించాడు. దూకుడుగా ఆడటమంటే తనకు ఇష్టమని, సెహ్వాగ్ శైలితో పాటు కోహ్లీ తరహాలోనూ క్రికెట్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చెలాయించి భారత్‌కు విజయాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాన్ని ఆచరణలో పెడుతున్నట్లు తాజా ఇన్నింగ్స్‌తో స్పష్టమవుతోంది.

ముంబై ఇండియన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

- ఐపీఎల్‌లో భారీ ట్రేడ్.. ముంబై ఇండియన్స్‌కు మారిన అర్ష్‌దీప్ సింగ్
- ఈ ట్రేడ్‌ను అధికారికంగా ధ్రువీకరించిన అర్ష్‌దీప్ తండ్రి దర్శన్ సింగ్
- ముందస్తు సమాచారం లేకుండానే ఈ ట్రేడ్ జరగడం ఆశ్చర్యం కలిగించిందని వెల్లడి
- ముంబైలో రోహిత్, బుమ్రా వంటివారితో ఆడనుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్య
- ఈ ఒప్పందంలో హార్దిక్ పాండ్యా పంజాబ్‌కు వెళ్లే విషయంపై స్పష్టత ఇవ్వని దర్శన్ సింగ్





ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్ష్‌దీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది.

మాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది: దర్శన్ సింగ్

ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో న్యూజిలాండ్‌లో మాట్లాడిన దర్శన్ సింగ్, ఈ ట్రేడ్ గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. “ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను” అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

పంజాబ్‌ను వీడటం భావోద్వేగంగా ఉంది

పంజాబ్ కింగ్స్‌తో అర్ష్‌దీప్‌కు ఉన్న అనుబంధాన్ని దర్శన్ సింగ్ గుర్తుచేసుకున్నారు. “ఒక వ్యక్తి ఎక్కడ పుట్టినా, ఆ ప్రదేశంతో జీవితాంతం ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అర్ష్‌దీప్‌కు పంజాబ్ కింగ్స్ అలాంటిదే. ఆ జట్టుతో అతనికి బలమైన బంధం ఉంది. అందుకే ఆ జట్టును వీడాల్సి రావడం కొంచెం భావోద్వేగంగా అనిపిస్తోంది” అని ఆయన అన్నారు. అయితే, ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టు సమతూకం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, వారు కూడా అందుకు అనుగుణంగానే అర్ష్‌దీప్‌ను ట్రేడ్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు.

ముంబై జట్టులోకి వెళ్లడం సంతోషమే

పంజాబ్‌ను వీడటం బాధగా ఉన్నప్పటికీ, ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లడంపై దర్శన్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. “ముంబై ఇండియన్స్‌లో చేరడం మాకు చాలా ఆనందంగా ఉంది. అక్కడ అతని పాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి పాత సహచరులు ఉన్నారు. కాబట్టి మేం సంతోషంగా ఉన్నాం” అని వివరించారు.

ఐపీఎల్ 2027లో బుమ్రా, అర్ష్‌దీప్ కలిసి బౌలింగ్ చేయడాన్ని చూడటానికి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. “ఇక ముంబై బౌలింగ్ అటాక్ అద్భుతంగా ఉంటుంది. ఏ స్కోరునైనా వారు అడ్డుకోగలరు. ప్రత్యర్థి జట్లను 200 పరుగుల లోపే కట్టడి చేస్తారని అభిమానులు అంటున్నారు. ఇది గొప్ప భాగస్వామ్యం అవుతుంది” అని ఆయన అన్నారు.

అయితే, ఐపీఎల్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా (ఫ్లాట్‌గా) ఉంటాయని, అక్కడ ఏమైనా జరగొచ్చని వాస్తవిక దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఈ ట్రేడ్ జీతం, ఇతర వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

ఇండియా వర్సెస్ న్యూజిలాండ్: ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయిన మూడో వన్డే



భారత్-న్యూజిలాండ్ మధ్య మూడో వన్డేకు వర్షం అంతరాయం కలిగించింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం కొనసాగుతోంది.

ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో టాస్ ఆలస్యమైంది. పలుసార్లు టాస్‌ను వాయిదా వేశారు. మధ్యలో కాసేపు వరుణుడు విరామం ఇవ్వడంతో టాస్ వరకు మార్గం సుగమమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన గిల్.. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని నిర్ణయించాడు.మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న సమయంలో మళ్లీ వర్షం మొదలైంది. కాసేపటికే అది మరింత పెరగడంతో మైదానాన్ని తిరిగి కవర్లతో కప్పేశారు. ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూములకు చేరుకున్నారు.న్యూజిలాండ్ కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు తుది గడువు ఉంది. అప్పటికి ఇంకా 70 నిమిషాల సమయం ఉన్నప్పటికీ వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.మూడో వన్డే రద్దుతో భారత్‌కు సిరీస్‌లో 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం ఇరు జట్లు టౌరంగాకు వెళ్లనున్నాయి. నాలుగో వన్డే నవంబర్ 13న బే ఓవల్‌లో, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి.

‘రంగస్థలం’ చిట్టి బాబును..’పుష్ప’ పుష్పరాజ్‌ను మించేలా..!



వజ్రాల ఆభరణాలలో అబ్బురపరిచిన రకుల్ ప్రీత్ సింగ్





సుకుమార్ తెరకెక్కించిన రంగస్థలం, పుష్ప చిత్రాల్లో హీరోల పాత్రల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు =జ17లో రామ్ చరణ్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి పెరుగుతోంది. ప్రీ లుక్‌లోని నెమలి పింఛం ఆధారంగా చరణ్ పాత్రపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చిట్టిబాబు, పుష్పరాజ్‌లను మించే క్యారెక్టరైజేషన్ ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

పాన్ ఇండియా రేసింగ్ లో దర్శకుడు సుకుమార్ స్థానం ఇప్పుడు ఎక్కడ ఉందో తెలిసిందే. పుష్ప, పుష్ప 2 చిత్రాలతో రూ.2000 కోట్ల వసూళ్ల క్లబ్ ని అందుకున్నాడు సుక్కూ. భారతదేశంలో దిగ్గజ దర్శకులుగా చెప్పుకునే చాలా మంది స్టార్ డైరెక్టర్లు ఈ ఫీట్ ని ఇంకా సాధించలేదు. రాజమౌళి, నితీష్ తివారీ లాంటి వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించింది.అందుకే ఇప్పుడు సుకుమార్ తెరకెక్కించే సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది ట్రేడ్ లోను సుక్కూ తన తదుపరి చిత్రంలో కథానాయకుడిని ఎలా చూపించబోతున్నాడు? అన్నది ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. అతడు పాత్రలను సరికొత్తగా తీర్చిదిద్దే విధానం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రంగస్థలంలో చెవులు వినిపించని(చెవిటి) చిట్టి బాబును.. పుష్పలో గూని వంచే ఊరమాస్ పుష్పరాజ్ ని చూపించిన సుకుమార్ ఆ రెండు పాత్రల ఆహార్యాన్ని అంతకుముందు ఎన్నడూ చూడని విధంగా చూపించారు. సుక్కూ ఎంపిక చేసుకున్న పాత్రలు ఎంతో రియలిస్టిక్ గా, నేచురల్ గా, ప్రజలు రెగ్యులర్ గా చూసేవిగా కనిపిస్తూనే, గమ్మత్తయిన ఆహార్యంతో అలరించాయి.రంగస్థలంలో గోదారి కుర్రాడిగా చరణ్‌ను చూపించిన తీరును ఇప్పటికీ మర్చిపోలేరు. ఇక గంధపు చెక్కల స్మగ్లర్ గా అల్లు అర్జున్ లాంటి స్టైలిష్ స్టార్ ని అతడు పెద్ద తెరపై ఆవిష్కరించిన తీరు గురించి చాలా చర్చ సాగుతూనే ఉంది. టాలీవుడ్ కి ఉత్తమ నటుడిగా మొదటి జాతీయ అవార్డ్ తేగలిగిన ప్రతిభ సుకుమార్ సొంతం.అందుకే ఇప్పుడు రామ్ చరణ్ ని ఆర్.సి 17లో ఎలా చూపించబోతున్నాడు? అన్నది ఆసక్తిగా మారింది. రంగస్థలం లో చిట్టిబాబు పాత్రతో చరణ్ ని అంతకుముందు ఉన్న ఇమేజ్ చట్రం నుంచి బయటకు తెచ్చాడు. కేవలం మాస్ యాక్షన్ హీరోగానే కాదు.. నటుడిగాను అతడిలోని బెస్ట్ ఏంటో చూపించాడు. చిట్టిబాబుగా చరణ్ నటనకు జాతీయ అవార్డ్ రావాల్సింది. రకరకాల కారణాలతో పురస్కారం దక్కలేదనే చర్చ తెలుగు మీడియాలో ఇప్పటికీ సాగుతూనే ఉంది. అందుకే ఇప్పుడు ఆర్.సి 17లో చరణ్ ని సుక్కూ ఎలా చూపించబోతున్నారు? అన్న చర్చ అంతకంతకు వేడెక్కిస్తోంది.

ఇప్పటివరకు =జ17లో చరణ్ పాత్రకు సంబంధించి చిన్న లీక్ కూడా బయటకు రాకుండా సుకుమార్ పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే గతంలో విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్‌లో కనిపించిన నెమలి పింఛం ఆధారంగా చరణ్ ఈ సినిమాలో గోపీ కృష్ణుడు లేదా ఒక భిన్నమైన రెబెల్ షేడ్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపిస్తాడనే ప్రచారం గట్టిగా జరుగుతోంది. చిట్టిబాబును, పుష్పరాజ్ ను దాటుకుని వెళ్లే స్థాయి క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడం సుకుమార్‌కు పెద్ద సవాలే అయినా.. అతడి మార్క్ మేకింగ్ తప్పకుండా మరో బిగ్గెస్ట్ విజువల్ ట్రీట్‌ని ఇస్తుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ తన కెరీర్ లో మర్చిపోలేని మరో అద్భుతమైన పాత్రలో నటిస్తున్నాడని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఆర్.సి 17 నుంచి చరణ్ లుక్ విడుదలైతే కానీ ఈ పాత్ర ఎలాంటిదో ఇంకా ఊహించలేము.

దీపావళి వేడుకల్లో మెరిసిపోయిన సోఫీ చౌధ్రి -- ఆకర్షణీయమైన సీక్విన్డ్ చీరలో మెరిసిన తార



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965